తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 111 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 ఆదివారం 22 - 11 - 2026 వెల రూ. 2 రూ/

ప్రతి కుటుంబానికి
ఒకరికే ఇందిరమ్మ జీవిత బీమా

- వయోపరిమితి 18--59 ఏళ్లు
- 18 నుంచి 59 ఏళ్లలోపు వారికే అర్హత
- 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు అర్హులు
- ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ ఆధారంగా వయస్సు నిర్ధారణ
- పుట్టిన సంవత్సరం మాత్రమే ఉంటే జూలై 1వ తేదీని ప్రామాణికంగా తీసుకోనున్న అధికారులు
- బీమా కవరేజీ ప్రారంభమైన తేదీ నుంచి ఏడాది పాటు జీవిత బీమా రక్షణ



హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి సంబంధించి అధికారులు తాజాగా కీలక మార్గదర్శకాలను వెల్లడించారు. కుటుంబాలకు జీవిత బీమా రక్షణ కల్పించే ఈ పథకంలో ఎవరు అర్హులు? వయోపరిమితి ఎంత? దరఖాస్తుకు ఏ నిబంధనలు వర్తిస్తాయి? అనే వివరాలను స్పష్టం చేశారు.ఇందిరమ్మ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే నమోదు చేసుకోవడానికి అర్హులు. ముఖ్యంగా కుటుంబ పెద్దకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దరఖాస్తుదారుల వయస్సు తప్పనిసరిగా 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి.అధికారులు వెల్లడించిన మార్గదర్శకాల ప్రకారం.. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు ఈ పథకానికి అర్హులుగా పేర్కొన్నారు. కాబట్టి దరఖాస్తు చేసుకునే ముందు తమ వయస్సు నిర్దేశిత పరిమితిలో ఉందో లేదో పరిశీలించుకోవాలి.లబ్ధిదారుల వయస్సును నిర్ధారించేందుకు ప్రభుత్వం ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోనుంది. ఒకవేళ ఆధార్ కార్డులో పూర్తి పుట్టిన తేదీ లేకుండా కేవలం - మిగతా 2 లో



కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి రాజీనామా సవాల్

- హుజూరాబాద్‌లో కొత్త పింఛన్లు ఇవ్వలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శ
- ఒక్క కొత్త పింఛను మంజూరు చేసినట్లు తేలితే రాజీనామా చేస్తానని సవాల్
- నియోజకవర్గంలో 1,029 పింఛన్లను రద్దు చేశారని ఆరోపణ

హైదరాబాద్ :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త - మిగతా 2 లో

పార్టీ లైన్ దాటితే
చర్యలు తప్పవు



- రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందంటూ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య
- ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడి
- పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్ :

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి సొంత పార్టీపై చేసిన - మిగతా 2 లో

'ఆపరేషన్ సిందూర్' వేళ
పాక్‌కు చైనా రహస్య సాయం

- అమెరికా నివేదికలో బండారం బట్టబయలు!
- భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
- ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
- భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన వైనం
- రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక



ఢిల్లీ :

భారత్ ఎదుగుదలను అణచివేసే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందించిందని అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. - మిగతా 2 లో

గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది
పేదరికం నుంచి బయటపడ్డారు



- సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను
- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీఎం మోదీ కీలక వ్యాఖ్యలు!
- ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ
- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
- 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి

ఢిల్లీ :

సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం - మిగతా 2 లో



అమెరికా - చైనా మధ్య ముదురుతున్న
చిప్ వార్!

- ఐదు దేశాలకు ఏఐ చిప్‌ల ఎగుమతులపై అమెరికా ఆంక్షలు కఠినతరం
- మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, సింగపూర్, బ్రెజిల్‌పై కొత్త నిబంధనలు
- విదేశీ డేటా సెంటర్ల ద్వారా చైనా కంపెనీలకు చిప్‌ల సరఫరాపై అమెరికా ఆందోళన
- ఎన్విడియాపై పెరుగుతున్న నియంత్రణ ఒత్తిడి.. 11.5 శాతం పడిపోయిన షేర్లు

అమరావతి :

అమెరికా, చైనాల మధ్య చిప్ వార్ మొదలైంది. ఇటీవల ఎన్విడియా కంపెనీకి చెందిన ఏఐ చిప్స్ అక్రమ మార్గాల ద్వారా చైనాకు ఎగుమతి - మిగతా 2 లో

కొత్త ఎయిర్‌లైన్స్‌కు
భోగాపురం కేంద్రస్థానం కావాలి



- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వెల్లడి
- సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి

అమరావతి :

కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం - మిగతా 2 లో

మూడు రోజులు
బ్యాంకులు బంద్

- నవంబర్ చివరి వారంలో బ్యాంకులకు పలు సెలవులు
- గురునానక్ జయంతి సందర్భంగా పలు నగరాల్లో బ్యాంకులు బంద్
- హైదరాబాద్‌లోనూ మంగళవారం బ్యాంకులకు సెలవు
- నవంబర్ 28న నాలుగో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా సెలవు
- సెలవు రోజుల్లో ఆన్‌లైన్, ఏటీఎం సేవలు యథాతథం



ప్రజా తీర్పుతో
మాలో బాధ్యత పెరిగింది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే
- కార్యకర్తే అధినేత, పార్టీకి అసలైన బలమని చంద్రబాబు స్పష్టం చేశారు
- స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా గెలుపే లక్ష్యంగా పనిచేశారని భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు
- ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే
- మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్



అమరావతి :

స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపించిన ప్రజలందరికీ సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పరిషత్ ఎన్నికల్లో ప్రజలు అద్భుత ఫలితాలు ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల పాలనకు ప్రజలిచ్చిన తీర్పుగా దీనిని భావిస్తున్నామన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.కార్యకర్తే అధినేత, వారే పార్టీకి అసలైన బలమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా గెలుపే లక్ష్యంగా పనిచేశారని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈసారి అభ్యర్థులకు టికెట్లు కేటాయించామని తెలిపారు. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొత్తవారికి అవకాశమిచ్చామని చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో విద్యార్హతలు, ప్రవర్తన, పార్టీ పట్ల అంకితభావం, విధేయతకు ప్రాధాన్యమిచ్చామన్నారు.బీసీలు మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీకి - మిగతా 2 లో

డెడ్ స్టోరేజీకి చేరువలో
శ్రీశైలం రిజర్వాయర్

- తాగునీటికే ప్రాధాన్యమిస్తున్న ఏపీ
- శ్రీశైలం జలాశయంలో డెడ్ స్టోరేజీకి చేరువగా పడిపోయిన నీటి నిల్వలు
- వర్షాభావ పరిస్థితులతో రాయలసీమలో ఎండిపోతున్న పంటలు
- శ్రీశైలం మిగులు జలాలను తాగునీటికే పరిమితం చేయాలని ఏపీ నిర్ణయం
- హంద్రీ-నీవా ద్వారా ఒక్క తడికైనా నీరివ్వాలని కోరుతున్న రైతులు
- కృష్ణా డెల్టా కోసం నాగార్జున సాగర్ నుంచి 11 టీఎంసీలు కోరిన ఏపీ



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో ఒకవైపు కోస్తా జిల్లాలను తుపాన్లు అతలాకుతలం చేస్తుంటే, మరోవైపు రాయలసీమలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేక పంటలు ఎండిపోయే దశకు చేరుకోగా, శ్రీశైలం - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 22 - 11 - 2026

సంపాదకీయం

మనీలా సందేశం



రెండేళ్ళ తరువాత క్వాడ్ సమావేశం జరగడమే ఓ విశేషమైతే, దీనికితోడు, అమెరికా అధ్యక్షుడే స్వయంగా హాజరైనారు కనుక, మీడియాకు అది గొప్ప వేడుక అయింది. క్వాడ్ సభ్యదేశం కాని ఫిలిప్పీన్స్‌లో ఈ సదస్సు జరగడం మరో విశేషం. రాజధాని మనీలాలో 'ఆసియాన్' సభ్యత్వ దేశాల నేతలంతా 'కలసికట్టుగా మన భవితను నిర్దేశించుకుందాం' అంటూ ప్రాంతీయ శాంతి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, భద్రత ఇత్యాది అంశాలమీద చర్చలు చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ 23వ భారత్--ఆసియాన్ సదస్సులో పాల్గొని మిగతా దేశాలతో వాణిజ్యం, దీర్ఘకాలిక సంబంధాల మీద మాట్లాడారు. 'ఆసియాన్' ఆఖర్లో మనీలా వచ్చిన అమెరికా అధ్యక్షుడు, మరికొందరు నేతలు ఎలాగూ ఎపెక్ సదస్సుకోసం చైనా వెళ్ళవలసి ఉన్నది కనుక 'క్వాడ్' కూడా ఇక్కడే జరిగిందని చెబుతున్నారు. అయితే, ప్రయాణసౌలభ్యం కాక, మనీలాలో కొన్ని హెచ్చరికల తరువాతే చైనాలో అడుగుపెట్టాలని ట్రంప్ నిర్ణయించుకోవడంతో క్వాడ్ సదస్సు ఏర్పాటు కాస్తంత హడావుడిగా జరిగిందని కొందరు అంటారు.దాదాపు దశాబ్దంపాటు నిద్రావస్థలో ఉన్న క్వాడ్‌ను 2017 నవంబరులో మనీలాలో జరిగిన ఆసియాన్ సదస్సు సందర్భంగానే ఈ నాలుగు దేశాలు పునరుద్ధరించాయి. మళ్ళీ తొమ్మిదేళ్ళకు అక్కడే అత్యున్నతస్థాయి నాయకుల సదస్సు జరగడం నిజానికి విశేషమే. ఆసియాన్ దేశాలను క్వాడ్ పట్టించుకోవడం లేదన్న విమర్శలను తిప్పికొట్టడానికి కూడా పక్కపక్కనే రెండు సదస్సులు జరగడం ఉపకరిస్తుంది. సముద్రంలో చైనా వీరంగాలను ఫిలిప్పీన్స్ నేరుగా భరిస్తోంది కనుక, క్వాడ్ భాగస్వామి కాకున్నా అక్కడ ఈ సదస్సు జరిపి, ఫిలిప్పీన్స్ సార్వభౌమత్వ పరిరక్షణకు తామంతా కట్టుబడివున్నామని, ఇండో--పసిఫిక్ ప్రాంతంలో అంతర్జాతీయ సముద్రజలాల్లో చైనా దూకుడును ఎంతమాత్రం ఉపేక్షించబోమని క్వాడ్ చాటిచెప్పింది. చైనాతో సయోధ్యకు అమెరికా తహతహలాడుతున్నది కనుక, ఆ సాన్నిహిత్యంమీద క్వాడ్ భవిష్యత్తు ఆధారపడి వుంటుందన్నది నిజం. చైనా, రష్యా అధినేతలతో అత్యున్నత స్థాయి భేటీకి ముందు ట్రంప్ మనీలాలో క్వాడ్ మీద ఎంతో అభిమానాన్ని ప్రకటించారు. క్వాడ్ పుట్టుకే చైనా లక్ష్యంగా జరిగింది కనుక, శత్రువుతో బేరాలు ఆడుకోవడానికి ఈ వేదికను వాడుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. పైగా, మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తిన్న ఆయనకు ప్రపంచపటంమీద తాను చక్రం తిప్పుతున్నానని చెప్పుకోవచ్చు. మలివిడత అధికారంలోకి వచ్చిన తరువాత చైనాతో అవసరాల రీత్యా క్వాడ్ మీద ట్రంప్ అంతగా దృష్టిపెట్టలేదు కానీ, 2007లో పుట్టి, ఆ తరువాత జపాన్, ఆస్ట్రేలియా రాజకీయ పరిణామాల కారణంగా నిస్తేజంగా మారిన క్వాడ్‌ను 2017లో పునరుద్ధరించింది ఆయనే. అన్ని రంగాల్లోనూ అన్ని విధాలా ఎదిగిపోతున్న చైనాకు సంకెళ్ళ వేయడానికి ఏర్పడినప్పటికీ, దానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడటం కంటే, పరోక్షంగా చురకలంటించడానికే క్వాడ్ పరిమితమైంది.సముద్ర నిఘావ్యవస్థ, ఉమ్మడి సైనికవిన్యాసాలు, కేబుల్ కనెక్టివిటీ, సైబర్ సెక్యూరిటీ భాగస్వామ్యం ఇత్యాది అనేక సరికొత్త ఆశయాలు క్వాడ్ దేశాధినేతలు ప్రకటించారు. ఈ ప్రాంతంలో చైనా దూకుడును, దాని ఏకపక్ష ఎగుమతి ఆంక్షలను పరోక్షంగా విమర్శిస్తూ, సురక్షితమైన రవాణా కారిడార్ల కోసం కలిసి పనిచేయాలని, కీలకమైన సరఫరా వ్యవస్థలను సురక్షితంగా మార్చుకోవాలని క్వాడ్ సంకల్పించింది. కృత్రిమ మేధకు సూపర్ ఇంటలిజెన్స్ అని ఇటీవలే నామకరణం చేసిన ట్రంప్ దానిలో పెట్టుబడులు, విస్తరణతో క్వాడ్ బలోపేతం కాబోతోందన్నారు. పారిశ్రామిక విప్లవం కంటే గొప్ప మార్పును ఏఐ తెస్తుందని, క్వాడ్ సభ్యదేశాలన్నీ దానితో ప్రయోజనం పొందుతాయని, భద్రతభయాలకు ఇక తావులేదన్నారు. వచ్చే ఏడాది క్వాడ్ దేశాల వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహించి, వాణిజ్యసంబంధాలను మరింత బలోపేతం చేయబోతున్నట్టు, అలాగే, విస్తృతస్థాయిలో ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహించబోతున్నట్టు ప్రకటించారు. మరిన్ని కొత్త నిర్ణయాలు కూడా అప్పుడు జరుగుతాయట. క్వాడ్ శిఖరాగ్ర సమావేశం ఉమ్మడి ప్రకటన కూడా దాని భవిష్యత్ సహకారం, చైనామీద ఏమాత్రం ఆధారపడే అవసరంలేని వ్యవస్థల ఏర్పాటు విషయంలోనూ ఎంతో నమ్మకాన్ని పెంచేట్టుగానే ఉంది. అయితే, చైనా అధ్యక్షుడిని ఆలింగనం చేసుకోవడానికి వెడుతూ మధ్యలో మనీలాలో కాలూనిన అమెరికా అధ్యక్షుడు రేపటిరోజుల్లోనూ క్వాడ్ పట్ల ఇంతే పట్టుదలగా ఉంటారా?

డెడ్ స్టోరేజీకి చేరువలో శ్రీశైలం రిజర్వాయర్

మొదటిపేజీ తరువాయి - ప్రాజెక్టులో నీటిమట్టం అడుగంటడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఎగువ కృష్ణా పరీవాహక ప్రాంతం నుంచి వరద రాక తగ్గడంతో, శ్రీశైలంలో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వినియోగించడంతో శ్రీశైలంలో నిల్వలు వేగంగా పడిపోయాయి. నవంబర్ 20 నాటికి మొత్తం 215.80 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీశైలంలో కేవలం 46.82 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. మరో 8 టీఎంసీలు తగ్గితే జలాశయం 38 టీఎంసీల డెడ్ స్టోరేజీ స్థాయికి పడిపోతుంది. డిసెంబర్‌లోనూ నీటి వినియోగం కొనసాగితే వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.రాయలసీమలో వర్షాభావంతో మొక్కజొన్న తదితర పంటలు ఎండుతుండటంతో, హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా కనీసం ఒక్క తడికైనా నీరు ఇచ్చి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.మరోవైపు కృష్ణా డెల్టా సాగునీటి అవసరాలు కూడా ఇంకా తీరలేదు. 312 టీఎంసీల సామర్థ్యం గల నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం 177.47 టీఎంసీల నీరు ఉంది. దీంతో డెల్టా అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు 11 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఏపీ జలవనరుల శాఖ ఇండెంట్ ఇచ్చింది. నవంబర్ 23న జరిగే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ నీటి విడుదలను ప్రధాన ఎజెండాగా చేర్చాలని ఏపీ బోర్డుకు లేఖ రాసింది. తాగునీటి కోసం శ్రీశైలాన్ని రక్షించుకుంటూనే, డెల్టా అవసరాలకు సాగర్ నీటిని వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

మొదటిపేజీ తరువాయి - వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు.ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ప్రతి కుటుంబానికి ఒకరికే ఇందిరమ్మ జీవిత బీమా



మొదటిపేజీ తరువాయి - పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉంటే, అటువంటి వారి పుట్టిన తేదీని అదే ఏడాది జూలై 1గా పరిగణించి అర్హతను నిర్ణయిస్తారు.ఈ పథకంలో నమోదు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు బీమా కవరేజీ ప్రారంభమైన తేదీ నుంచి ఏడాది పాటు జీవిత బీమా రక్షణ అందుబాటులో ఉంటుంది. అంటే బీమా ప్రారంభ తేదీ నుంచి పూర్తి 12 నెలల పాటు ఈ రక్షణ వర్తిస్తుంది.పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అర్హత కలిగిన కుటుంబాలు వయోపరిమితి, ఆధార్ వివరాలు, ఇతర మార్గదర్శకాలను పరిశీలించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది

మొదటిపేజీ తరువాయి - అందగా నిలిచారని గుర్తుచేశారు. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా వెన్నంటే ఉన్నారని కొనియాడారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించామని చెప్పారు. పల్నాడులో జడ్పీ ఛైర్మన్ అభ్యర్థి ఎంపికలోనూ సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో జనరల్ స్థానమైనప్పటికీ ఎస్సీ మహిళకు అవకాశం ఇచ్చి జడ్పీ ఛైర్మన్ పదవి కట్టబెట్టామని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కోట పుల్లమ్మ ఎంటెక్ చదివారని చంద్రబాబు వెల్లడించారు.'ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే. స్థానిక సంస్థల్లో ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తే, పరిషత్ ఎన్నికల్లో 96.4 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో 3.6 శాతం ఓట్లు పెరిగాయి. గొడ్డలి పార్టీ 39.8 నుంచి 6 శాతానికిపైగా ఓట్లు కోల్పోయింది. కూటమి అభ్యర్థుల సీట్ల సర్దుబాటుపై చాలా శ్రద్ధ పెట్టాం. అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశాం. ఎన్నికల కోసం ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేశాం.జిల్లా పరిషత్ పీఠాలపై మహిళలు, విద్యాధికులు, సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. 22 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకు కేటాయించామని తెలిపారు. వీరిలో 14 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారని వెల్లడించారు. 20 జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు అవకాశం ఇచ్చామన్నారు. వైస్ ఛైర్‌పర్సన్లలో 17 మంది ఉన్నత విద్యావంతులని వివరించారు. సామాన్య కార్యకర్తలను జడ్పీ ఛైర్‌పర్సన్లుగా నియమించామని తెలిపారు. అత్యుత్తమ యువ నాయకత్వం రావాలంటే విద్యాధికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు.బూత్ కమిటీలు, క్లస్టర్లు, జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, సీనియర్ నేతలతో చర్చించిన తర్వాతే అభ్యర్థుల ఎంపికపై ప్రతిపాదనలు చేశామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇన్‌ఛార్జులు, నలుగురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. మిత్రపక్షాలతో సమన్వయం కోసం ఈ కమిటీలు పనిచేశాయని తెలిపారు.స్థానిక ఎన్నికల ఫలితాలు కొందరు ఎమ్మెల్యేలకు మేలుకొలుపు కావాలని చంద్రబాబు హెచ్చరించారు. ప్రతీ ఫలితాన్ని క్షుణ్ణంగా విశ్లేషించి అందుకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. పంచాయతీఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించేలా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే పురపాలిక, పరిషత్ ఎన్నికల్లో కూటమికి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వైఎస్సార్సీపీ పరిస్థితి మరింతగా దిగజారుతోందని చెప్పారు. ఈ విజయాలను రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.వైఎస్సార్సీపీ పన్నిన కుట్రలను ఛేదించి, ఆ పార్టీ డ్రామాలను నమ్మకుండా తీర్పునిచ్చిన ప్రజలకు చంద్రబాబు హ్యాట్సాఫ్ చెప్పారు. స్థానిక ఎన్నికల వేళ గొడ్డలి పార్టీ ఎన్నో విన్యాసాలు చేసిందని ధ్వజమెత్తారు. హింసకు పాల్పడింది వాళ్లే, ఫిర్యాదులు చేసింది వాళ్లేనని విమర్శించారు. ఈ నాటకాలను ప్రజలు విశ్వసించలేదని అందుకే వైఎస్సార్సీపీ ఆటలు సాగలేదని స్పష్టం చేశారు. అంతిమంగా స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీకి ప్రజల మద్దతు దక్కలేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించే శక్తిని ప్రజలు ఇచ్చారని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో తమపై బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఇప్పుడు మూడు స్థాయిల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కారుగా మారిందని అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని, అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.పీసీపీ అధ్యక్షురాలు షర్మిల కుమార్తె వివాహానికి తనను ఆహ్వానిస్తే దాన్నీ రాజకీయం చేస్తున్న వారిని ఏం అనాలని చంద్రబాబు ప్రశ్నించారు. రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలు వేరన్న కనీస ఇంగిత జ్ఞానం కూడా లేదా అని నిలదీశారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు షర్మిలతోపాటు జగన్ పెళ్లికి కూడా తనను ఆహ్వానించారని, తానూ వెళ్లినట్లు గుర్తుందని చంద్రబాబు చెప్పారు. అలాంటిది షర్మిల కుమార్తె పెళ్లికి ఆహ్వానిస్తే అందులో ఏం రాజకీయం కనిపించిందన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నా మానవ సంబంధాలను గౌరవించాలన్న కనీస బాధ్యత లేదా? అంటూ జగన్ మీడియా తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం

మొదటిపేజీ తరువాయి - సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు బీజింగ్ ప్రయత్నిస్తోందని అమెరికా-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ వెల్లడించింది. ఆసియాలో చైనాకు ప్రత్యామ్నాయ శక్తిగా భారత్ ఎదుగుతోందని, దీనిని అడ్డుకునేందుకే చైనా బహుముఖ వ్యూహాలను రచిస్తోందని పేర్కొంది.గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే పాకిస్థాన్‌ను బలోపేతం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే-10సీఈ యుద్ధ విమానాల పూర్తి స్థాయి వినియోగానికి తమ ఇంజనీర్లు అక్కడే ఉండి సాంకేతిక సహకారం అందించారని చైనా స్వయంగా అంగీకరించిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. భారత్ మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా చైనా ఎప్పటికప్పుడు పాక్‌కు చేరవేసిందని తెలిపింది. భవిష్యత్‌లో రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు (టూ-ఫ్రంట్ వార్) ఎదురయ్యే ప్రమాదం దీనివల్ల భారత్‌కు మరింత పెరుగుతోందని హెచ్చరించింది.మరోవైపు భారత్‌పై చైనా ఆర్థిక అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని దెబ్బతీసేందుకు ముడిసరకుల ఎగుమతులను ఆపడం, తమ ఇంజనీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలకు దిగుతోందని తెలిపింది. భారత ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాలు పుంజుకోకుండా చైనా తక్కువ ధరల వ్యూహాలను, బ్యాటరీ టెక్నాలజీ ఆంక్షలను అమలు చేస్తోందని విశ్లేషించింది. ఈ వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తన రక్షణ రంగాన్ని ఆధునికీకరిస్తూనే దేశీయ తయారీకి పెద్దపీట వేస్తోందని, అమెరికా కూడా భారత్‌తో నిఘా, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఈ కమిషన్ పిలుపునిచ్చింది.

గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

మొదటిపేజీ తరువాయి - ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు.ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు.ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు.అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు.సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు



అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి - వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు."కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది" అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. "గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది" అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే

అమెరికా - చైనా మధ్య ముదురుతున్న చిప్ వార్!



మొదటిపేజీ తరువాయి - అయ్యాయనే వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో చైనా కంపెనీలు విదేశీ డేటా సెంటర్ల ద్వారా అమెరికా అధునాతన ఏఐ చిప్‌లను పొందకుండా అడ్డుకునేందుకు అమెరికా కొత్త ఆంక్షల్ని విధించింది. ఇందులో భాగంగా మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, సింగపూర్, బ్రెజిల్ దేశాలకు పంపించే ఏఐ చిప్‌లపై ఎగుమతి లైసెన్సింగ్ నిబంధనల్ని మరింత కఠినతరం చేసింది.అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఎన్విడియాపై దర్యాప్తు జరుపుతుందనే వార్తల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో ఇప్పటికే నియంత్రణపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఎన్విడియాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ వార్తల నేపథ్యంలో నవంబర్ 20న ఎన్విడియా షేర్లు 11.5 శాతం పడిపోయాయి. తాజా ఆంక్షల తర్వాత ఆగ్నేయాసియాలో ఏఐ మౌలిక సదుపాయాల పెట్టుబడులకు ఇబ్బందులు తలెత్తవచ్చు. ఇదే సమయంలో సెమికండక్టర్ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు వేగం కావచ్చని నవంబర్ 19న జెఫరీస్ విడుదల చేసిన 'గ్రీడ్ అండ్ ఫియర్' నివేదిక వెల్లడించింది.అమెరికా ఇప్పటికే చైనా కంపెనీలకు అధునాతన ఏఐ చిప్‌లను నేరుగా కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. అయితే, విదేశీ డేటా సెంటర్లు, క్లౌడ్ సర్వీస్ ద్వారా చైనా సంస్థలు కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పొందుతున్నాయనే ఆందోళన ఉంది. 2024లో నిషేధం అమలైనప్పటి నుంచి సుమారు 2,40,000 ఎన్విడియా చిప్‌లు చైనాకు అక్రమ రవాణా జరిగి ఉండొచ్చని జెఫరీస్ అంచనా వేసింది. సింగపూర్‌కు చెందిన మెగా స్పీడ్ సంస్థ, అలీబాబా సహా ఇతర చైనా కస్టమర్లకు సుమారు 86,000 గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను లీజుకు ఇస్తోందని ఈ నివేదిక ప్రస్తావించింది.అమెరికా టెక్నాలజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి చైనా తన దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమను బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. చిప్ డిజైన్, తయారీ, పరికరాలు, ముడి పదార్థాల రంగాల్లో స్వదేశీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంటోంది.

మూడు రోజులు బ్యాంకులు బంద్



మొదటిపేజీ తరువాయి - బ్యాంకు ఖాతాదారులకు ముఖ్య గమనిక. వచ్చే వారం (నవంబర్ 22 నుంచి 28 వరకు) బ్యాంకులకు పలు సెలవులు ఉన్నాయి. ముఖ్యమైన పనుల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకునే వారు ఈ సెలవుల జాబితాను ముందుగా చూసుకోవడం మంచిది. లేదంటే అనవసరంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గురునానక్ జయంతి, నాలుగో శనివారం వంటి కారణాలతో దేశంలోని అనేక ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి.

సెలవుల వివరాలు:

నవంబర్ 23 (సోమవారం): సెంగ్ కుట్ స్నెమ్ సందర్భంగా కేవలం షిల్లాంగ్‌లో మాత్రమే బ్యాంకులకు సెలవు ప్రకటించారు.

నవంబర్ 24 (మంగళవారం): గురునానక్ జయంతి, కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, భోపాల్, చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో బ్యాంకులు పనిచేయవు.

నవంబర్ 27 (శుక్రవారం):కనకదాస జయంతి సందర్భంగా బెంగళూరులో బ్యాంకులకు సెలవు. ఇక నవంబర్ 28వ తేదీ నెలలో నాలుగో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవు ఉంటుంది.బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ, ఖాతాదారులు ఆన్‌లైన్ సేవలను యథావిధిగా వినియోగ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 22 - 11 - 2026

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమీక్ష



కర్నూలు నవంబర్ 21 తెలుగుకలం : కర్నూలు కోర్టు కాంపౌండ్‌లోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయంలో శనివారం ఆ విభాగపు విధులు, పనితీరుపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీ పి. వాసు, సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. వాసు మాట్లాడుతూ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు, కక్షిదారులకు అందించాల్సిన చట్టపరమైన సలహాలు, జైలు సందర్శనలు (జైలు విజిట్లు), కేసుల నమోదు మరియు పరిష్కార విధానాలపై పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో ఇప్పటివరకు ఎన్నింటికి బెయిల్ మంజూరైందో అడిగి తెలుసుకున్న ఆయన, ఆయా కేసుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించి, వాటిని మరింత త్వరితగతిన పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ చంద్ర రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ. సులోచన మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ఖాకీల కనుసన్నల్లోనే

ప్రజాస్వామ్య ఖూనీ మాజీ ఎంపీ తలారి రంగయ్య నిప్పులు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసు, ఎన్నికల వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయని మాజీ ఎంపీ తలారి రంగయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం అనంతపురం ఎస్పీని కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గంలో నామినేషన్ల సమయం నుంచే అభ్యర్థులను అడ్డుకోవడం, రిగ్గింగ్‌కు పాల్పడటం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని తలారి రంగయ్య పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోనే ఏకంగా నాలుగు జెడ్పీటీసీ, దాదాపు 38 ఎంపీటీసీ స్థానాల ఫలితాలను డీఎస్పీ, సీఐల సమక్షంలోనే తారుమారు చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు నుంచే పోలీసుల నుంచి ప్రజలను రక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఎన్నికల అధికారుల నుంచే ఎన్నికలను కాపాడుకోవాల్సిన దుస్థితి దాపురించిందని గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. ఎలాంటి గొడవల్లో సంబంధం లేని అమాయకులను అక్రమ కేసుల్లో ఏ1, ఏ2 నిందితులుగా చేర్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. వ్యవస్థలు ఇలా విఫలమైతే ప్రజలకు ప్రభుత్వం, పోలీసు, ఎన్నికల వ్యవస్థలపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారులపై నమ్మకం లేక ప్రజలే స్వయంగా పోలింగ్ కేంద్రాల వద్ద కాపలా ఉండి, కౌంటింగ్ పూర్తయ్యే వరకు తమ ఓట్లను కాపాడుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కనీసం రాబోయే సర్పంచ్ ఎన్నికలనైనా నిష్పక్షపాతంగా నిర్వహించాలని తలారి రంగయ్య డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని మర్యాదపూర్వకంగా

కలిసిన నూతన జెడ్పీటీసీ సభ్యులు





శింగనమల (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : శింగనమల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పుట్లూరు మరియు యల్లనూరు మండలాల జెడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు తమపై ఎంతో నమ్మకంతో అఖండ విజయాన్ని అందించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె ఆకాంక్షించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, క్షేత్రస్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. ప్రజాసేవే పరమావధిగా భావించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. మండలాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుని, నాయకులు మరియు కార్యకర్తల సమష్టి కృషితో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లె ప్రాంతాల్లో 'ధరణి బియ్యం' పంపిణీ వాహనాన్ని

జెండా ఊపి ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



కర్నూలు(తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అత్యంత తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురావాలనే ఉన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ధరణి బియ్యం' పంపిణీ కార్యక్రమానికి శనివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పల్లె ప్రాంతాల్లో బియ్యాన్ని పంపిణీ చేసే ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా నాణ్యమైన బియ్యాన్ని నేరుగా వారి ముంగిటకే చేర్చేందుకు ప్రభుత్వం ఈ ప్రత్యేక వాహన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. మార్కెట్లో పెరుగుతున్న నిత్యావసర ధరల నేపథ్యంలో, ప్రభుత్వ నిర్ణయం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఊరటనిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వాహనాల ద్వారా పల్లెల్లోని ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన బియ్యం అందేలా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. బియ్యం పంపిణీ ప్రక్రియలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, వాహనాలు నిర్దేశిత సమయానికి ఆయా గ్రామాలకు చేరుకునేలా సంబంధిత శాఖాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియంలో ఘనంగా 'నాణెములు, స్టాంపులు మరియు కరెన్సీ ప్రదర్శన'

అనంతపురం నవంబర్ 21 తెలుగుకలం : ప్రపంచ వారసత్వ వారోత్సవాలు -- 2026 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాల వద్ద 'నాణెములు, స్టాంపులు మరియు కరెన్సీ ప్రదర్శన' అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఐఏఎస్ మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్), లేడీస్ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ మరియు ఎస్ఎస్బిఎన్ కళాశాల సంయుక్త సహకారం అందించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు ప్రదర్శనను తిలకించి మాట్లాడుతూ, వేల సంవత్సరాల క్రితం నాటి పురాతన నాణేలు, వందలాది రకాల దేశ విదేశీ స్టాంపుల సేకరణను జిల్లా మ్యూజియంలో ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి అరుదైన చారిత్రక ప్రదర్శనలను కేవలం విద్యార్థులు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలందరూ తప్పక వీక్షించి చరిత్రను తెలుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ అనంతపురం సహాయ సంచాలకులు స్వామి నాయక్



మాట్లాడుతూ, శతాబ్దాల కాలం నాటి నాణేలు, స్టాంపుల వినియోగంలో కాలక్రమేణా వచ్చిన మార్పులను ఈ ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించామన్నారు. ఇది విద్యార్థులకు, పరిశోధకులకు విజ్ఞాన సముపార్జనకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఇంటాక్ కన్వీనర్ శ్రీరామ్ కుమార్ మాట్లాడుతూ, ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు నాణేలు, కరెన్సీ మరియు స్టాంపులలో వచ్చిన విప్లవాత్మక మార్పులు ఆయా కాలాల నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అద్దం పడతాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో తమ అరుదైన సేకరణలను ఉంచిన ప్రముఖ కలెక్టర్లు గోవిందరాజులు గుప్తా మరియు పి. శివ ప్రసాద్ తమ అనుభవాలను పంచుకుంటూ, గత యాభై ఏళ్లుగా తాము ఎంతో ఇష్టంతో దేశ



విదేశీ స్టాంపులు, ప్రాచీన కాలం నాటి నాణేలు, మధ్యయుగ కాలం నుండి నేటి వరకు చలామణిలో ఉన్న వివిధ రకాల పేపర్ కరెన్సీని సేకరిస్తున్నట్లు తెలిపారు. తమ సేకరణల విలువను, చరిత్రను నేటి తరం విద్యార్థులకు వివరించడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు పి. కృష్ణమూర్తి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రియాజ్, సూర్యనారాయణ రెడ్డి, జూటూరు షరీఫ్, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మ నారాయణరెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ జయంతి, ఎస్ఎస్బిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి భార్గవితో పాటు పలువురు చరిత్రకారులు, విద్యార్థులు మరియు పురప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరం కంటి, చెవి పరీక్షలు నిర్వహణ

అనంతపురం నవంబర్ 21 తెలుగుకలం : జాతీయ వయోవృద్ధుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అనంతపురం నగరంలో వయోవృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక అరవింద్ నగర్‌లోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో ఈ శిబిరం జరిగింది. వయోవృద్ధుల ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి, వారికి సకాలంలో తగిన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేసినట్లు సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. అర్చన తెలిపారు. ఈ సందర్భంగా జి. అర్చన మాట్లాడుతూ, వయోవృద్ధులు ఆరోగ్యంగా, ఆత్మగౌరవంతో మరియు స్వతంత్రంగా జీవించేందుకు ఇటువంటి ప్రత్యేక వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ శిబిరంలో అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు డా. సుహాసిని, శ్రవణ వైద్య విభాగ నిపుణులు డా. సుధాకర్, మరియు నాయక్ నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. సుకుమార్ రెడ్డి పాల్గొని వయోవృద్ధులకు కంటి, చెవి మరియు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు అందించి, తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు చేశారు. వైద్య నిపుణులు మాట్లాడుతూ, వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు



మందగించడం, కంటిశుక్లం (క్యాటరాక్ట్), మరియు వినికిడి లోపం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. వీటిని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులు లేదా కంటి చుక్కలు వాడకూడదని తెలిపారు. అలాగే చెవుల్లో ఎలాంటి వస్తువులు పెట్టకపోవడం, అధిక శబ్దాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు పాటించాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సిబ్బందితో పాటు నాయక్ నగర్ యూపీహెచ్‌సీ ఫార్మసిస్ట్ రఘు రంగనాథ్, ఎంఓ అసిస్టెంట్ కమల కుమారి, ఏఎన్ఎం సుమిత్ర, ఎంపీహెచ్ఏ వెంకటేశ్వర్లు, ఆశా



కార్యకర్తలు, మరియు వసతి గృహ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి తమ వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు.

బియ్యం, పప్పుధాన్యాల నిల్వలపై కొరడా.. నిల్వ పరిమితులు, గరిష్ఠ ధరలు ఖరారు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్చరిక

అనంతపురం నవంబర్ 21 తెలుగుకలం : రాష్ట్రంలో వరి, బియ్యం అక్రమ నిల్వలను అరికట్టడంతో పాటు, ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ వరి మరియు బియ్యం (నిల్వ పరిమితులు మరియు తప్పనిసరి నిల్వ వెల్లడి) నియంత్రణ ఉత్తర్వులు--2026'ను జారీ చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. జి.ఓ.ఎం.ఎస్. నెం.18 (తేదీ 20.11.2026) ద్వారా జారీ అయిన ఈ ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా 2027 జనవరి 31 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ నిబంధనలు వరి, బియ్యం కొనుగోలు, రవాణా, విక్రయాలు, పంపిణీ మరియు నిల్వ చేసే హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, పెద్ద రిటైల్ సంస్థలు, రైస్ మిల్లర్లు, ప్రాసెసర్లు, బల్క్ కన్స్యూమర్లు, కమిషన్ ఏజెంట్లు మరియు ఎగుమతిదారులకు వర్తిస్తాయి. ఏ సమయంలోనైనా 10 క్వింటాళ్లకు మించి బియ్యం లేదా వరి నిల్వ ఉన్నా, లేదా రెండూ కలిపి 25 క్వింటాళ్లకు మించి ఉన్నా వారు ఈ ఉత్తర్వుల పరిధిలోకి వస్తారు. ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్న వారు ఉత్తర్వులు అమల్లోకి వచ్చిన 7 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, కొత్తగా ప్రారంభించే వారు ముందస్తుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో సంస్థ పేరు, చిరునామా, యజమాని వివరాలు, **GSTIN/PAN**, మిల్లులు, గోదాముల చిరునామాలను సమర్పించాలి. నిర్దేశిత పరిమితులకు మించి నిల్వలు ఉన్న ప్రతి వ్యాపారి, మిల్లర్ తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్ **(https://dfpd.gov.in)** లో 7 రోజుల్లోగా నమోదు చేసి, ఆ తర్వాత ప్రతి శుక్రవారం తప్పనిసరిగా



అప్‌డేట్ చేయాలి. బియ్యం నిల్వలను బాస్మతి, నాన్-బాస్మతి ప్రీమియం, సాధారణ నాన్-బాస్మతి, ఉప్పుడు బియ్యం, నూకలు మరియు వరి ధాన్యం అనే ఆరు రకాలుగా విభజించి నమోదు చేయాల్సి ఉంటుంది. తప్పుడు వివరాలు నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిల్వ పరిమితుల ప్రకారం ట్రేడింగ్ రైస్ మిల్లర్లు 4,000 క్వింటాళ్లు లేదా 7 రోజుల మిల్లింగ్ సామర్థ్యం --- ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే ఆ పరిమాణం వరకు నిల్వ చేసుకోవచ్చు. హోల్‌సేల్ వ్యాపారులు మున్సిపల్ కార్పొరేషన్లలో 1,000 క్వింటాళ్లు, ఇతర జిల్లా కేంద్రాల్లో 500 క్వింటాళ్లు, మిగిలిన ప్రాంతాల్లో 250 క్వింటాళ్ల వరకు నిల్వ ఉంచుకోవచ్చు. రిటైల్ వ్యాపారులకు పట్టణ ప్రాంతాల్లో 100 క్వింటాళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 50 క్వింటాళ్ల వరకు అనుమతి ఉంది. నిర్దేశించిన పరిమితులకు మించి నిల్వలు ఉంచరాదని, గరిష్ఠ ధరలను తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే రకం బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్ల పేర్లతో అధిక ధరలకు విక్రయించడం, ప్యాకింగ్‌పై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేయడం, రైతుల నుంచి కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేయడం వంటి అక్రమాలకు పాల్పడితే నిత్యావసర వస్తువుల చట్టం--1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు, మార్కెట్‌లో పెరుగుతున్న పప్పు ధాన్యాల ధరలను నియంత్రించేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలో కందిపప్పు, మినపప్పు, శనగలు, మసూర్ పప్పు, పెసలు, పసుపు బఠానీల వ్యాపారం నిర్వహించే దిగుమతిదారులు, మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు మరియు పెద్ద రిటైల్ సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఫుడ్ స్టాక్ పోర్టల్ **(https://fcainfoweb.nic.in/psp/)** లో తమ నిల్వల వివరాలను నమోదు చేసి, ప్రతి శుక్రవారం అప్‌డేట్ చేయాలి. పప్పుధాన్యాల విషయంలో అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, నిల్వల వివరాలు వెల్లడించకపోవడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే నిత్యావసర వస్తువుల చట్టం--1955తో పాటు బ్లాక్ మార్కెటింగ్ నిరోధక చట్టం--1980 కింద కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ మరియు పౌర సరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తారని, కావున వ్యాపారులందరూ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

కనేకల్ అభివృద్ధికి బాటలు వేద్దాం.. అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించండి

టిడిపి సర్పంచ్ అభ్యర్థి ఆనంద్ రాజు

ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్న ఆనంద్ రాజు

కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్ల అభ్యర్థన

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

కనేకల్ (తెలుగు కలం) (నవంబర్ 21) : కనేకల్ మేజర్ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో టిడిపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఆనంద్ రాజు దూసుకుపోతున్నారు. శనివారం ఆయన తన కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు మరియు స్థానిక నాయకులతో కలిసి కనేకల్ పట్టణంలోని పలు వీధులు, కాలనీల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ రాజు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మరియు కనేకల్



ప్రాంతంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తాను సర్పంచ్‌గా గెలుపొందిన తర్వాత పంచాయతీలో చేపట్టబోయే పలు అభివృద్ధి ప్రణాళికలను ఓటర్ల ముందుంచి, తనకు మద్దతు తెలపాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఆనంద్ రాజు మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసిపి పాలనలో కనేకల్ పంచాయతీ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు వంటి అనేక మౌలిక వసతుల సమస్యలు నెలకొన్నాయని, తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ఆ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని భరోసా ఇచ్చారు.కేవలం అభివృద్ధిని మాత్రమే ప్రామాణికంగా తీసుకుని ప్రజలు ఓటు వేయాలని ఆనంద్ రాజు విజ్ఞప్తి చేశారు. కనేకల్ మేజర్ పంచాయతీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును వేసి, తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శింగనమల క్రాస్ వద్ద ఘనంగా 73వ శనివారం అన్నదాన కార్యక్రమం

శింగనమల (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : అనంతపురం జిల్లా శింగనమల మండల పరిధిలోని జాతీయ రహదారి (అమరావతి రోడ్డు), శింగనమల క్రాస్ వద్ద శ్రీ ఋష్యశృంగ మహాముని మరియు శ్రీ రంగరాయలు వారి ఇరువురి జ్ఞాపకార్థం 73వ శనివారం అన్నదాన కార్యక్రమాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జె. రామ్ చరణ్ యాదవ్ మాట్లాడుతూ, గడిచిన 73 వారాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న భక్తులందరికీ ఆ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. నేటి అన్నదాన కార్యక్రమానికి అన్నదాతగా వ్యవహరించిన శింగనమల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పకీరప్ప కుమారుడు నారాయణస్వామి మరియు వారి కుటుంబ సభ్యులు శ్రీ ఋష్యశృంగ మహాముని పేరుమీద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం అన్నదానంలో

పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత నారాయణస్వామి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటాన్ని అందించి ఘనంగా సన్మానించారు. వారికి ఆ దేవుని కృప ఎల్లప్పుడూ ఉండాలని రామ్ చరణ్ యాదవ్ కోరుకున్నారు. ఈ 73 వారాల అన్నదాన యజ్ఞానికి తమ వంతు సహకారంగా గోవిందరాయుని పేట గ్రామానికి చెందిన భక్తుడు ఏకుల ఆదినరసింహులు టమోటా బాక్సులు, కూరగాయలను అందిస్తుండగా, అనంతపురానికి చెందిన కాయగూరల బాబయ్య పచ్చిమిరపకాయలను అందిస్తున్నారు. వీరితో పాటు ఈ మహాకార్యానికి సహకరిస్తున్న ప్రతి ఒక్క భక్తుడికి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల దీక్షలో ఉన్న స్వాములు, అనంతపురం జిల్లా ప్రజలు, శింగనమల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ఆ ఋష్యశృంగ మహాముని ఆశీస్సులు ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

బొమ్మనహాల్ పంచాయతీపై రెపరెపలాడిన పసుపు జెండా.. చరిత్రలో తొలిసారి క్లీన్ స్వీప్!

సర్పంచ్‌గా పయ్యాల అనిల్ కుమార్,

12 వార్డు సభ్యులు ఏకగ్రీవం

నామినేషన్లకు దూరంగా వైసీపీ..

మిన్నంటిన టీడీపీ శ్రేణుల సంబరాలు

ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులుకు

కృతజ్ఞతలు తెలిపిన నూతన సర్పంచ్



బొమ్మనహాల్ (తెలుగు కలం) (నవంబర్ 21) : అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్ మండల కేంద్రమైన బొమ్మనహాల్ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సరికొత్త చరిత్ర సృష్టించింది. పంచాయతీ ఆవిర్భవించిన నాటి నుండి ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా, సర్పంచ్ స్థానంతో పాటు మొత్తం 12 వార్డులను ఏకగ్రీవంగా కైవసం చేసుకుని టీడీపీ పూర్తి స్థాయి ఆధిపత్యాన్ని చాటుకుంది.బొమ్మనహాల్ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నుండి ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడం విశేషం. నామినేషన్ల దాఖలు, పరిశీలన మరియు ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం, బరిలో మరెవరూ లేకపోవడంతో ఎన్నికల అధికారులు ఏకగ్రీవ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. సర్పంచ్ పదవికి టీడీపీ బలపరిచిన అభ్యర్థి పయ్యాల అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆయనతో పాటు పంచాయతీ పరిధిలోని 1 నుండి 12 వార్డుల వరకు టీడీపీ మద్దతుదారులే వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేజర్ పంచాయతీని పూర్తిగా కైవసం చేసుకోవడంతో బొమ్మనహాల్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఫలితాల ప్రకటన వెలువడగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. జై తెలుగుదేశం, జై కాల్వ నినాదాలతో గ్రామ వీధులు మార్మోగాయి.ఏకగ్రీవ ఎన్నిక అనంతరం నూతన సర్పంచ్ పయ్యాల అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన మండల, గ్రామ స్థాయి టీడీపీ నాయకులకు, అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, ఏకగ్రీవానికి సహకరించిన గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామస్తులు నాపై ఉంచిన



నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు గారి సహకారంతో, వార్డు సభ్యులందరినీ కలుపుకుని బొమ్మనహాల్ మేజర్ పంచాయతీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాను. గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాను" అని ఆయన హామీ ఇచ్చారు. బొమ్మనహాలు జెడ్పిటిసి మహేంద్ర ఆయనను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

పల్లె పోరుకు సిద్ధంకండి.. ప్రతి పంచాయతీపై పసుపు జెండా ఎగురవేద్దాం!

రాప్తాడు, ధర్మవరం టీడీపీ శ్రేణులకు జడ్పీ చైర్మన్ పరిటాల శ్రీరామ్ పిలుపు

అనంతపురం / పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : కూటమి అగ్రనాయకుల ఆశీస్సులతో శ్రీ సత్యసాయి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పరిటాల శ్రీరామ్, రాబోయే పంచాయతీ ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పరిటాల అభిమానులకు ఆయన ఒక ప్రకటన ద్వారా హృదయపూర్వక విజ్ఞప్తి చేశారు. ?ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, మంత్రి నారా లోకేష్‌ల ఆశీస్సులతో, ఎన్నో ఆటుపోట్లు మరియు త్యాగాల అనంతరం జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం మనందరికీ గర్వకారణమని శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ చారిత్రక విజయాన్ని, ప్రమాణ స్వీకారోత్సవాన్ని కార్యకర్తల సహకారంతో ఎంతో ఘనంగా జరుపుకున్నామని, అయితే ఆ గెలుపు ఆనందం మనలో ఉత్సాహాన్ని నింపాలే తప్ప అలసత్వానికి దారితీయకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి పునాది లాంటి గ్రామ పంచాయతీ ఎన్నికల బాధ్యత ఇప్పుడు మన



ముందుందని ఆయన గుర్తుచేశారు.?కార్యకర్తలందరూ వ్యక్తిగత భేదాభిప్రాయాలు, చిన్నచిన్న అలకలను పక్కనపెట్టి పార్టీ గెలుపే పరమావధిగా ఒక సైనికుడిలా సమష్టి కృషితో ముందుకు సాగాలని శ్రీరామ్ సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, యువనేత నారా లోకేష్ ప్రోత్సాహంతో మన ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ వివరించాలని కోరారు. పరిటాల కుటుంబం ఎప్పుడూ విలువలతో కూడిన రాజకీయాలకు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని, అదే హుందాతనంతో ప్రజాసేవే అసలైన అజెండాగా ప్రజల మనసులు గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. ?పదవుల కంటే ప్రజాసేవే మిన్న అని మరోసారి నిరూపిస్తూ రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామ పంచాయతీపై పసుపు జెండాను సగర్వంగా ఎగురవేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టి నాయకత్వానికి అసలైన కానుకను అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 26వ తేదీన జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల వరకు పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, 26వ తేదీ ఎన్నికల అనంతరం అందరం కలుద్దామని పరిటాల శ్రీరామ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

బాలల అక్రమ రవాణాను అడ్డుకున్న ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి.. నలుగురు బాలల రక్షణ

తెనాలి / బాపట్ల (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : రైళ్లలో జరుగుతున్న బాలల అక్రమ రవాణాను ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు సంయుక్తంగా అడ్డుకుని నలుగురు మైనర్లను రక్షించారు. తెనాలి జిఆర్‌పి ఎస్ఐ ఎల్. సరస్వతి వెల్లడించిన వివరాల ప్రకారం, విజయవాడ నుంచి బాపట్ల వరకు ఉన్న వివిధ రైల్వే స్టేషన్లలో అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. విజయవాడ, బాపట్ల ఆర్‌పిఎఫ్ పోస్ట్ సిబ్బందితో పాటు బాపట్ల క్రైమ్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, జిల్లా బాలల సంరక్షణ విభాగం, ఏపీ అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ మరియు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించారు. శుక్రవారం ధన్‌బాద్--అలప్పుజా ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేస్తుండగా నలుగురు బాలలు అనుమానాస్పదంగా కనిపించారు. వారి ఆధార్ కార్డులు, ఇతర వివరాలను పరిశీలించగా వారంతా మైనర్లు అని తేలింది. అదే సమయంలో వారితో పాటు ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి పోలీసులను



చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, సిబ్బంది అతడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జార్ఖండ్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని, వారి తల్లిదండ్రులకు ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పి నమ్మించాడు. అనంతరం ఆ పిల్లలను హటియా రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి, రైలు టికెట్లు కొనిపెట్టి, ప్రయాణ ఖర్చుల కోసం కొంత నగదు ఇచ్చి అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం రక్షించిన నలుగురు బాలలతో పాటు నిందితుడిని బాపట్ల రైల్వే స్టేషన్‌కు తరలించారు. రక్షించబడిన వారిలో 17 ఏళ్ల బాలుడు ఒకరు ఉండగా, 15 ఏళ్లలోపు వయసున్న ముగ్గురు బాలికలు ఉన్నారు. వీరందరినీ గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యూసి) ఎదుట హాజరుపరిచారు. కమిటీ ఆదేశాల మేరకు ఆ నలుగురు బాలలను బాపట్లలోని ఎంఆర్ నగర్‌లో ఉన్న 'ది ఆర్ఫన్ ఇన్ ఏషియా చిల్డ్రన్స్ హోమ్'కు సురక్షితంగా తరలించారు. ఉపాధి పేరిట జరిగే బాలల అక్రమ రవాణా పట్ల ప్రజలు, తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

అనంతపురము జిల్లాలో ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర' పరిశుభ్రత కార్యక్రమం

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలు మరియు నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం, అనంతపురము జిల్లాలోని మొదటి దశకు చెందిన 46 సంక్షేమ విద్యా వసతి పాఠశాలలు మరియు విద్యా సంస్థల్లో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర' పరిశుభ్రత కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, విజయవంతంగా నిర్వహించబడింది. 'నెట్ జీరో ఆరోగ్యవంతమైన క్యాంపస్' కార్యక్రమంలో భాగంగా 'ఫారెస్ట్ బై హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్' జిల్లా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, వసతి గృహాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని పరిశుభ్రత పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పాఠశాల మరియు వసతి గృహ పరిసరాల్లోని వ్యర్థాలను సేకరించి, వాటిని శాస్త్రీయ పద్ధతిలో వేరు చేశారు. అనంతరం పొడి వ్యర్థాలను సంబంధిత గ్రామ పంచాయతీలకు అప్పగించడంతో పాటు 'స్వచ్ఛ రథం' వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల అధికారులు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ, 'గ్రీన్ మైండ్ నెట్ జీరో థింక్ ట్యాంక్'





భావనతో పరిష్కార దృక్పథంతో కార్యక్రమాలను ముందుకు నడిపించారు. దీని ద్వారా విద్యార్థులకు పొడి వ్యర్థాలు, తడి వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలు మరియు రీసైక్లింగ్ చేయదగిన వ్యర్థాల వర్గీకరణపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. అలాగే ప్రాంగణాల్లో వ్యర్థాలు పేరుకుపోయే హాట్‌స్పాట్లను గుర్తించి, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన



జాగ్రత్తలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ?జిల్లాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులాలు, ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, బీసీ సంక్షేమ వసతి గృహాలు, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు తదితర సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యాయి. జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్ రావు జి.ఎన్., క్లస్టర్ సమన్వయకర్తలు, ప్రిన్సిపాళ్లు, నోడల్ అధికారులు, ఉపాధ్యాయులు మరియు సహాయక సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

భూపసముద్రంలో చిరుత కలకలం.. ఆవుపై దాడి చేసి హతం



గుమ్మఘట్ట (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం భూపసముద్రం గ్రామ పరిసరాల్లో చిరుతపులి సంచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు గొల్ల గోవిందప్పకు చెందిన తోటలో అర్ధరాత్రి సమయంలో చిరుతపులి చొరబడి, అక్కడ కట్టేసి ఉన్న ఆవుపై ఒక్కసారిగా దాడి చేసి చంపేసింది. ఉదయం తోట వద్దకు వెళ్లిన రైతు గోవిందప్ప, విగతజీవిగా పడి ఉన్న తన ఆవును చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. జీవనోపాధికి ఆధారమైన ఆవు మృతి చెందడంతో ఆయన కన్నీరుమున్నీరయ్యారు. గత కొన్ని రోజులుగా గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తుండటంతో భూపసముద్రం మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పంట పొలాలకు, తోటలకు వెళ్లాలంటేనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు ఒంటరిగా పొలాల వైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించి, గ్రామ పరిసరాల్లో బోను ఏర్పాటు చేసి చిరుతపులిని బంధించాలని, అలాగే దాడిలో ఆవును కోల్పోయి నష్టపోయిన బాధిత రైతు గోవిందప్పకు ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నీలంపల్లి సచివాలయం వద్ద ఉద్రిక్తత..

నామినేషన్ల తిరస్కరణపై వైసీపీ శ్రేణుల ధర్నా



అనంతపురం(తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : నీలంపల్లి సచివాలయం వద్ద ఉద్రిక్తత బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చెదల్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల నామినేషన్లను అధికారులు అన్యాయంగా తిరస్కరించారని ఆరోపిస్తూ ఆ పార్టీ శ్రేణులు, మద్దతుదారులు సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అధికారుల తీరును నిరసిస్తూ సచివాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించడంతో అక్కడ ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సచివాలయంలోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించగా, అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ?ఈ క్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. పోలీసులు సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఆందోళనకారులు శాంతించకపోవడంతో కాసేపు సచివాలయ ప్రాంగణంలో ఉద్రిక్తత కొనసాగింది.

స్క్రూటిని ప్రక్రియను పర్యవేక్షించిన

జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్



నార్పల(తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో నార్పల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆర్వో చిన్న వీరస్వామి, ఎంపీడీవో మమతా దేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్యామలతో కలిసి ఆయన స్క్రూటిని కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్క్రూటిని జరుగుతున్న విధానాన్ని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్న అసిస్టెంట్ కలెక్టర్, ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోటీ చేసే అభ్యర్థులందరూ అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ ఉద్యోగుల క్రమానుగత శ్రేణి, ఎవరి విధులు ఏమిటి తదితర అంశాలపై ఎంపీడీవో మమతా దేవిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుభాన్, జూనియర్ అసిస్టెంట్ బబ్లు, సిబ్బంది నారాయణ, సురేష్, విష్ణు, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యర్రంపాలెం, సూరంపాలెం గ్రామాల్లో పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్



(తెలుగు కలం) (నవంబర్ 21) : గండేపల్లి : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గండేపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన యర్రంపాలెం, సూరంపాలెం గ్రామాల్లో శనివారం పోలీసులు భారీ స్థాయిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు, గండేపల్లి ఎస్ఐ యు. శివ నాగబాబు ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసు సిబ్బంది ఈ కవాతులో పాల్గొని గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా పర్యటిస్తూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు, ఎస్ఐ శివ నాగబాబు మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా జరిగేందుకు గ్రామస్థులందరూ పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా లేదా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలని సూచించారు.

ఎంఎస్ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాలలో నూతనంగా ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి. నిజాముద్దీన్, ఏపో ప్రకాష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. మేరీ సందీపా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ మేరీ సందీపా మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైన మలుపు అని పేర్కొన్నారు. ఈ దశలో క్రమశిక్షణ, పట్టుదల మరియు సమయపాలనతో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకోవాలని ఆమె హితవు పలికారు. విద్యార్థుల మధ్య స్నేహభావం, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఫ్రెషర్స్ డే వేడుకల ప్రధాన ఉద్దేశమని కళాశాల హెచ్ఓడీ సయ్యదా నస్రిన్ తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ మేరీ సందీపాను కళాశాల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వేడుకల అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోద కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం రంగస్వామి రెడ్డి, రషీద, పద్మావతి, కమిలిని, జనార్దన్ రెడ్డి, మస్తాన్ వలి, దీప్తి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం చాటుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాప్తాడు బాధిత విద్యార్థిని గోపికకు రూ. 50 వేల ఆర్థిక సహాయం



అనంతపురం / బెంగళూరు (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : రాప్తాడు పాఠశాల ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థిని గోపికకు భారత విద్యార్థి ఫెడరేషన్ అనంతపురం జిల్లా కమిటీ అండగా నిలిచి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. ఈ ఘటనలో గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపికను ఎస్ఎఫ్ఐ మరియు సిఐటియు నాయకులు ప్రత్యేకంగా పరామర్శించారు. ?ఈ సందర్భంగా నాయకులు గోపిక తల్లిదండ్రులతో మాట్లాడి ఆమె ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, వైద్య ఖర్చుల నిమిత్తం ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కమిటీ తరఫున రూ. 50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులోనూ కుటుంబానికి తమ సంఘం తరఫున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని నాయకులు భరోసా ఇచ్చారు.

వైసీపీ నేతల ఆరోపణలను

ప్రజలు తిప్పికొట్టాలి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి (తెలుగు కలం) (నవంబర్ 21) : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినప్పటికీ వారి తీరులో ఏమాత్రం మార్పు రాలేదని, వారి తప్పుడు ఆరోపణలను మేధావులు, ప్రజలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియపై వైసీపీ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తాను కౌంటింగ్, పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లానంటూ వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అసలు తాను కౌంటింగ్ కేంద్రం వైపు కూడా వెళ్లలేదని స్పష్టం చేసిన ఆయన, తనపై చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకనే వైసీపీ నాయకులు ఇలాంటి అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా, కేవలం పదవుల కోసమే వారు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు సాగించిన దౌర్జన్యాలను ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదని కందికుంట గుర్తు చేశారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి నాయకులందరూ కలిసికట్టుగా ప్రచారం నిర్వహించి ఘన విజయం సాధించాలని ఆయన సూచించారు. ఎన్నికలు పూర్తి నిష్పక్షపాతంగా జరుగుతాయని, ఎవరైనా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 22 - 11 - 2026

ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : స్థానిక ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ గంగాధర్, డాక్టర్ వి. కొండారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతనంగా చేరిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించారు. కెమిస్ట్రీ విభాగంలో టాపర్‌గా నిలిచిన షారున్ ఏంజెల్‌ను అభినందిస్తూ, విశ్రాంత అధ్యాపకులు కురుపేంద్ర రెడ్డి ఆమెకు రూ. 5,000 నగదు బహుమతిని అందజేశారు. చదువులో రాణిస్తున్న విద్యార్థులకు ఇటువంటి ప్రోత్సాహకాలు మరింత స్ఫూర్తినిస్తాయని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను

మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జడ్పీ ఛైర్మన్ గంజే నాగరాజు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : అనంతపురం జిల్లా పరిషత్ నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన గార్లదిన్నె జడ్పీటీసీ గంజే నాగరాజు శనివారం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో నాగరాజు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన నాగరాజుకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డితో పాటు పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిడిమామిడిలో వైసీపీలోకి

భారీగా చేరికలు.. టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని పుట్టపర్తి రూరల్ మండలం నిడిమామిడి పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తీర్థం పుచ్చుకున్నారు. పుట్టపర్తి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సమక్షంలో వారంతా అధికారికంగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలకు వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై నమ్మకంతో ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నిడిమామిడి పంచాయతీలో వైసీపీ మరింత బలోపేతం కావడానికి ఈ చేరికలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పాత, కొత్త నాయకులనే భేదం లేకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టపర్తిలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన

సత్యసాయి ఇన్స్టిట్యూట్ 45వ స్నాతకోత్సవానికి హాజరు



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : రాష్ట్ర గవర్నర్ జస్టిస్ (రిటైర్డ్) ఎస్. అబ్దుల్ నజీర్ ఈనెల 22వ తేదీన పుట్టపర్తిలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టరేట్ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది. సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 45వ వార్షిక స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 22న ఉదయం 10.10 గంటలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియానికి చేరుకుని, ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 45వ స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్ కృష్ణమాచారి చక్రవర్తి (రిటైర్డ్ ఐఏఎస్) అందర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ మరియు డాక్టోరల్ రీసెర్చ్ డిగ్రీలను ప్రదానం చేయనుండగా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. రాఘవేంద్ర ప్రసాద్ స్వాగతోపన్యాసం చేస్తారు. స్నాతకోత్సవ కార్యక్రమం అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ మధ్యాహ్నం 12.35 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడకు తిరుగుపయనమవుతారు. ఈ సందర్భంగా పుట్టపర్తి విమానాశ్రయం, ప్రశాంతి నిలయం పరిసరాలు మరియు రాకపోకల మార్గాల్లో అధికారులు అవసరమైన భద్రతా, ప్రోటోకాల్ ఏర్పాట్లు చేస్తున్నారు.

సాయి నామస్మరణతో మారుమోగిన పుట్టపర్తి

101వ జయంతి ఉత్సవాల్లో దివ్య నామస్మరణ ప్రారంభం



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తిలో శనివారం దివ్య నామస్మరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ దివ్య నామస్మరణ ర్యాలీ గణేష్ సర్కిల్ నుంచి ప్రారంభమై సత్యమ్మ ఆలయం వరకు ఉత్సాహంగా సాగింది. మార్గమధ్యంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు భజనలు, కోలాటాలతో సాయి నామస్మరణ చేస్తూ ముందుకు కదిలారు. భక్తుల భక్తి గీతాలు, కోలాటాల సందడితో పుట్టపర్తి వీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో, భక్తి పారవశ్యంతో మారుమోగాయి. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి బాబా ప్రబోధించిన ప్రేమ, సేవ, మానవత్వ సందేశాలను ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమైక్యత, సేవా దృక్పథం పెంపొందేలా బాబా బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి నరసయ్యతో పాటు ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అనంత సర్వజన ఆసుపత్రిలో వీల్‌చైర్ల కరువు.. చేతులపైనే రోగుల తరలింపు!

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) అత్యవసర విభాగానికి వచ్చే రోగులను వార్డులు, ఇతర విభాగాలకు తరలించేందుకు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో లేకపోవడంపై రోగులు, వారి బంధువుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది రోగులు మెరుగైన వైద్యం కోసం ఈ ఆసుపత్రికి వస్తుంటారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో నడవలేని స్థితిలో ఉన్న రోగులను తరలించడానికి కనీస స్థాయిలో కూడా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు దొరక్కపోవడంతో ఆపదలో ఉన్న రోగులను కుటుంబ సభ్యులే చేతులపై ఎత్తుకొని ఆసుపత్రి లోపలికి, వివిధ వార్డులకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో



ఇలా రోగులను చేతులపై మోసుకుంటూ వెళ్లాల్సి రావడంపై బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా వివిధ దాతలు, సంస్థల ద్వారా ఆసుపత్రికి వీల్‌చైర్లు అందుతున్నప్పటికీ, రోగుల రద్దీకి అనుగుణంగా వాటిని సరిగ్గా నిర్వహించడంలోనూ, అత్యవసర విభాగం వద్ద అందుబాటులో ఉంచడంలోనూ లోపాలు కనిపిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించకుండా ఏసీ గదులకే పరిమితమవుతున్నారని రోగులు, సహాయకులు మండిపడుతున్నారు. రోగుల ప్రాణాలకు, సౌకర్యానికి సంబంధించిన అంశంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆసుపత్రిలో కనీస వైద్య సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు అత్యవసర విభాగం, ప్రధాన ద్వారం వద్ద సరిపడా వీల్‌చైర్లు, స్ట్రెచర్లను నిరంతరం అందుబాటులో ఉంచాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇరగరాజుపల్లిలో మాజీ ఎమ్మెల్యే ప్రచారం

గోవిందమ్మ విజయానికి దిశానిర్దేశం



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : పుట్టపర్తి రూరల్ మండలం ఇరగరాజుపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి గోవిందమ్మ విజయానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శ్రేణులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గోవిందమ్మను భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కోరారు. సమన్వయంతో ముందుకు సాగి, అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం సబ్ డివిజన్లో సీఐటీయూ వాహన,

మైక్ ప్రచారానికి అనుమతులు ఇవ్వాలని డిఆర్వోకు వినతి



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన వాహన, మైక్ ప్రచార కార్యక్రమాలకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్వో) కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తాము చేపట్టబోయే ప్రచార కార్యక్రమం పూర్తిగా కార్మికుల సమస్యలు, వారి హక్కులు మరియు డిమాండ్ల సాధన కోసమేనని స్పష్టం చేశారు. ఈ ప్రచారానికి ఎలాంటి ఎన్నికలతోనూ సంబంధం లేదని, రాజకీయ ఉద్దేశాలు గానీ, ఎన్నికల ప్రచార కోణం గానీ ఇందులో ఏమాత్రం లేవని వారు తేల్చి చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రజల్లోకి, సంబంధిత యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వివరించారు. ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో ప్రచారం సాఫీగా సాగేందుకు వీలుగా వాహన, మైక్ వినియోగానికి అధికారులు అనుమతులు ఇచ్చి సహకరించాలని వారు కోరారు. డిఆర్వో కొండయ్యను కలిసిన ఈ ప్రతినిధి బృందంలో సీఐటీయూ నాయకులు ఓబులు, జిఎల్ నరసింహులు, సాంబ, లక్ష్మీనారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

పుట్టపర్తి విమానాశ్రయంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురానా తనిఖీలు



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 21 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆదివారం పుట్టపర్తికి విచ్చేస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. గవర్నర్ రాక సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా శనివారం శ్రీ సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) అంకిత సురానా ఐపీఎస్ పుట్టపర్తి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. విమానాశ్రయ ప్రాంగణంతో పాటు గవర్నర్ కాన్వాయ్ సంచరించే ప్రయాణ మార్గాలు, ప్రధాన కూడళ్లు మరియు వేదికల వద్ద భద్రతా పరిస్థితులను ఆమె సమీక్షించారు. జయంతి వేడుకల నేపథ్యంలో పుట్టపర్తికి భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ స్థలాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ?కాన్వాయ్ భద్రత, విమానాశ్రయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద తనిఖీలు, బందోబస్తు విధుల్లో మోహరించే పోలీసు సిబ్బంది బాధ్యతలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ, గవర్నర్ పర్యటన ప్రశాంతంగా, సజావుగా జరిగేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ అంకిత సురానా స్పష్టం చేశారు.

ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వార్డు సచివాలయ

ఉద్యోగులకు ఏపీఎస్ అమలు చేయాలి ఆర్డీఎంఏకు వినతి



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 21 : వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆరు సంవత్సరాల సేవ పూర్తయిన వెంటనే ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ (ఏపీఎస్) ను తక్షణమే అమలు చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం అనంతపురంలోని కార్యాలయంలో ప్రాంతీయ పురపాలక పరిపాలన సంచాలకులు (ఆర్డీఎంఏ) నాగరాజును కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్ మాట్లాడుతూ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరేళ్ల అర్హత సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఏపీఎస్ ద్వారా ఆర్థిక ప్రయోజనం కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ పథకం అమలుతో సిబ్బందికి ఎంతో ఊరట లభిస్తుందని వారు వివరించారు. అర్హులైన ఉద్యోగుల వివరాలను పరిశీలించి వేగంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఉద్యోగుల సంఘం నాయకుల వినతిపై సానుకూలంగా స్పందించిన ఆర్డీఎంఏ నాగరాజు, ఏపీఎస్ అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. సంబంధిత ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని ఆయన తెలియజేసినట్లు నాయకులు వెల్లడించారు.

హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు జగన్

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్రస్థాయిలో మండిపడ్డ జగన్

నామినేషన్లు చించేసి గెలిచినవారిని ఓడించారంటూ వైసీపీ అధినేత ఆరోపణలు

ఎంపీ అవినాశ్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై హత్యాయత్నాలు జరిగాయని ఆవేదన

పోలీసులు, అధికారులు అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని జగన్ ఆగ్రహం

ఎన్నికల అక్రమాలకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన జగన్



ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైసీపీ అధినేతజగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో పాటు ప్రస్తుతం పార్టీ రహితంగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను కూడా అధికార కూటమి రిగ్గింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్య సూత్రాలే అమలు కావడం లేదని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'ఫ్రీ అండ్ ఫెయిర్' ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయని జగన్ ఆరోపించారు. విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా, దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులే నేరుగా చించివేశారని ఆయన ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఓట్లను అపహరిస్తున్నారని, చివరకు ఎన్నికల్లో గెలిచిన వారిని కూడా ఓడినట్లుగా ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఫలితాలను ప్రభావితం చేస్తున్నారని, ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ చర్యలను అడ్డుకోవడంలో విఫలమైందని జగన్ విమర్శించారు. గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం ఎంతో సుస్థిరంగా, ప్రశాంతంగా సాగిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటూ వ్యవస్థలు పూర్తిగా భ్రష్టుపట్టాయని జగన్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై జరిగిన హత్యాయత్నాల ఘటనలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో దాడికి దిగారని, పోలీసుల ముందే వాహనాలకు నిప్పంటించి చంపే ప్రయత్నం చేశారని జగన్ ఆరోపించారు. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం కొమ్ముకాస్తూ, బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన పలు వీడియోలను వైఎస్ జగన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ జగన్ తన పోస్ట్‌లో పిలుపునిచ్చారు. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా

ఆసియాలోనే అతి పెద్ద రిలయన్స్ పానీయాల ఫ్యాక్టరీ..

ఓర్వకల్లు వేదికగా కాంపా కోలా ప్రస్థానం మళ్లీ మొదలైంది లోకేశ్

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ అతిపెద్ద ప్లాంట్

కేవలం ఏడాది వ్యవధిలోనే పూర్తయిన ప్రాజెక్ట్

కాంపా కోలా జ్యూస్‌ల తయారీ ప్రారంభం

స్థానిక యువతకు 1200 ప్రత్యక్ష ఉద్యోగాలు

వలసలు తగ్గిస్తూ సొంత జిల్లాలోనే ఉపాధి

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక మైలురాయి నమోదైంది. ప్రముఖ దిగ్గజ సంస్థ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ ప్లాంట్‌ను విజయవంతంగా ప్రారంభించింది. శంకుస్థాపన జరిగిన కేవలం 12 నెలల వ్యవధిలోలోనే ఇంతటి భారీ అత్యాధునిక తయారీ నాకేంద్రాన్ని పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించడం విశేషం. ఈ సాయంత్రం ఐదు గంటలకు ఓ భారీ ప్రకటన ఉంటుందన్న మంత్రి నారా లోకేశ్.. చెప్పినట్టుగానే ఈ మేరకు ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గత ఏడాది నవంబర్‌లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ జరిగింది. పనులను శరవేగంగా పూర్తి చేసుకున్న ఈ ప్రపంచ స్థాయి ప్లాంట్‌లో ఇప్పటికే కాంపా కోలా, పండ్ల రసాలు (జ్యూస్‌లు), ప్యాకేజ్డ్ తాగునీటి ఉత్పత్తి మొదలైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ ప్లాంట్ అత్యుత్తమ నిదర్శనంగా నిలిచింది. తరతరాల భారతీయులకు సుపరిచితమైన స్వదేశీ బ్రాండ్ కాంపా కోలా, ఇప్పుడు రాయలసీమ

కడప జిల్లా కోర్టును సందర్శించిన

బసవ రామ తారకం న్యాయ విద్యార్థులు







కడప తెలుగుకలం నవంబర్ 21 : కడపలోని శ్రీమతి బసవ రామ తారకం మెమోరియల్ లా కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం న్యాయ విద్యార్థులు శుక్రవారం కడప జిల్లా కోర్టును సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జహీరుద్దీన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు జిల్లా కోర్టులోని వివిధ విభాగాలను పరిశీలించి, న్యాయస్థానం పనితీరు, న్యాయ విచారణ ప్రక్రియ మరియు కోర్టు విధివిధానాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్శన ద్వారా న్యాయస్థానం యొక్క విశిష్టత, న్యాయ వ్యవస్థలో దాని ప్రాధాన్యతతో పాటు న్యాయ విలువలు, న్యాయవాదుల బాధ్యతలను విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం లభించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జహీరుద్దీన్ మాట్లాడుతూ, న్యాయస్థానాల పనితీరును దగ్గరగా తెలుసుకోవడం వల్ల భవిష్యత్తులో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించేందుకు అవసరమైన అనుభవం, వృత్తిపరమైన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు న్యాయ వ్యవస్థపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, రాజ్యాంగ విలువలు, న్యాయ సూత్రాల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సతీష్, సయ్యద్ మస్తాన్ బాషా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 22 - 11 - 2026

ఆరోగ్యకరమైన భోజనం అంటే ఏమిటి? 'ప్లేట్ ఫార్ములా' ఏం చెబుతోంది

ఆరోగ్యకరమైన భోజనానికి నిపుణుల 'ప్లేట్ ఫార్ములా'

ప్లేటులో సగం భాగం పండ్లు, కూరగాయలతో నింపాలి

పావు వంతు చిరుధాన్యాలు, మరో పావు వంతు ప్రొటీన్లు

తప్పనిసరి

ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండాలి

శరీరానికి తగినన్ని నీళ్లు తాగడం చాలా ముఖ్యం

మనం రోజూ తినే ఆహారమే దాదాపుగా మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. అయితే, ఏది తినాలి, ఏది తినకూడదు, ఎంత తినాలి అనే విషయాలపై చాలామందికి గందరగోళం ఉంటుంది. ఈ నేపథ్యంలో, సుమారు 25 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ వైద్య నిపుణుడు, అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఓంకార్ స్వామి, ఆరోగ్యకరమైన భోజనం కోసం ఒక సులభమైన 'ప్లేట్ ఫార్ములా'ను సూచిస్తున్నారు. కఠినమైన డైట్ నియమాలు పాటించకుండా, కేవలం ప్లేటులో పదార్థాలను సరిగ్గా సర్దుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆయన వివరిస్తున్నారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది.

ప్లేటులో సగం కూరగాయలు, పండ్లే ఉండాలి

మనం తినే ప్లేటులో సగం భాగం తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో నింపి ఉండాలని డాక్టర్ ఓంకార్ స్వామి చెబుతున్నారు. వీటిలో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, జీర్ణవ్యవస్థను మె రుగుపరుస్తాయి. వివిధ రంగుల కూరగాయలు, పండ్లను ఎంచుకోవడం ద్వారా శరీ రానికి అవసరమైన విభిన్న ఫోషకాలు అందుతాయి.

పావు వంతు సంపూర్ణ ధాన్యాలు, చిరుధాన్యాలు

ప్లేటులోని మరో పావు వంతులో సంపూర్ణ ధాన్యాలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉండాలి. గోధుమ, బియ్యం వంటి వాటికి బదులుగా రాగులు, జొన్నలు, సజ్జలు, బ్రౌన్ రైస్ వంటి వాటిని ఎంచుకోవడం ఉత్తమం. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు, అధిక ఫైబర్ కంటెంట్ వల్ల కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

మరో పావు వంతు ప్రొటీన్లు

కండరాల నిర్మాణం, కణజాలాల మరమ్మతు, హార్మోన్ల ఉత్పత్తికి ప్రొటీన్లు అత్యవసరం. ప్లేటులోని మిగిలిన పావు భాగంలో పప్పుధాన్యాలు, పాలు, పెరుగు, గుడ్లు, మాంసం, చేపలు, సోయా, నట్స్ వంటి ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. శాఖాహారులు, మాంసాహారులు తమకు అందుబాటులో ఉన్న ప్రొటీన్ వనరులను ఎంచుకోవచ్చు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

శరీరానికి కొవ్వులు కూడా అవసరమే అయినప్పటికీ, వాటిని మితంగా తీసుకోవాలి. ముఖ్యంగా నట్స్, విత్తనాలు, ఆలివ్ ఆయిల్ వంటి మంచి కొవ్వులను ఎంచుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక ఉప్పు, చక్కెర కలిపిన శీతలపానీయాలకు వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఇవి ఊబకాయం, రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. వీటన్నిటితో పాటు, రోజూ తగినన్ని నీళ్లు తాగడం కూడా చాలా ముఖ్యమని, ఇది జీవక్రియలను సక్రమంగా నడిపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ సూచనలు కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమేనని, ప్రతి ఒక్కరి శరీరాకృతి, ఆరోగ్య అవసరాలు వేర్వేరుగా ఉంటాయని, అందుకే వ్యక్తిగత సలహా కోసం తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని డాక్టర్ ఓంకార్ స్వామి స్పష్టం చేశారు



ఫిట్‌నెస్‌తోనే ఫ్రీ మైండ్ నా సక్సెస్ సీక్రెట్ ఇదే: విరాట్ కోహ్లీ

శారీరక దృఢత్వమే మానసిక స్పష్టతకు కారణమన్న కోహ్లీ

ఫిట్‌గా ఉండటం వల్లే ఆటను సరిగ్గా అంచనా వేయగలుగుతున్నానని వెల్లడి

కోహ్లీ వ్యాఖ్యలను బలపరిచిన వైద్య నిపుణుల అభిప్రాయం

వ్యాయామం ఒత్తిడిని తగ్గించి, సరైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తుందన్న నిపుణులు



ఆధునిక క్రికెట్‌లో ఫిట్‌నెస్ ప్రమాణాలను కొత్త శిఖరాలకు చేర్చిన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. శారీరక దృఢత్వానికి, మైదానంలో కనబరిచే మానసిక స్పష్టతకు మధ్య బలమైన సంబంధం ఉందని నొక్కిచెప్పాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో అజేయంగా 139 పరుగులు చేసిన అనంతరం కోహ్లీ తన ఫిట్‌నెస్ ఫిలాసఫీని వివరించాడు."స్పేచ్ఛగా ఆలోచించే మనసు కోసం, దృఢమైన శరీరం అవసరం" అని కోహ్లీ స్పష్టం చేశాడు. "నేను శారీరకంగా ఫిట్‌గా ఉండటానికే అధిక ప్రాధాన్యం ఇస్తాను. ఆ ఫిట్‌నెస్ వల్లే ఆటను ఎలా ఆడాలో స్పష్టంగా ఊహించుకోగలుగుతాను. ఇది మైదానంలోకి వెళ్లి నా ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయడానికి ఉత్తమ అవకాశం కల్పిస్తుంది" అని అన్నాడు. ప్రస్తుతం తన కెరీర్ దశలో, అతిగా దూకుడు ప్రదర్శించకుండా, అలా అని నెమ్మదిగా ఆడకుండా.. సానుకూల దృక్పథంతో తన ఆటలో ఒక కొత్త వర్షన్‌ను ఆవిష్కరించే ప్రయత్నంలో ఉన్నానని కోహ్లీ తెలిపాడు. శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉండటమే ఈ కొత్త విధానానికి కారణమని పేర్కొన్నాడు.కోహ్లీ చెప్పిన ఈ మాటలను వైద్య నిపుణులు కూడా శాస్త్రీయంగా బలపరుస్తున్నారు. క్రమం తప్పకుండా చేసే శారీరక శ్రమ మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపుతుందని అంటున్నారు. వ్యాయామం జ్ఞాపకశక్తిని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, సమాచారాన్ని వేగంగా గ్రహించి ఒత్తిడిలో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని (ఎగ్జిక్యూటివ్ డెసిషన్-మేకింగ్) పెంచుతుందని చెబుతున్నారు.శారీరకంగా చురుగ్గా ఉండే వ్యక్తులు ఒత్తిడికి గురైనప్పుడు వారి శరీరం భిన్నంగా స్పందిస్తుందని నిపుణులు తెలిపారు. వారిలో ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్లు తక్కువ స్థాయిలో విడుదలవుతాయని, హృదయ స్పందనల రేటు కూడా నెమ్మదిగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధంగా శరీరం, మనసు మధ్య ఉండే బలమైన సంబంధం వల్లే అథ్లెట్లు తీవ్రమైన ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ మెరుగైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మైదానంలో తన విజయాలకు ఫిట్‌నెస్ ఎలా పునాది వేస్తుందో కోహ్లీ చెప్పిన మాటలు ఈ శాస్త్రీయ వాస్తవానికి సరైన నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కళ్లలో కనిపించే ఈ మార్పులు గుండెపోటుకు సంకేతాలా

కంటి రెటీనా ద్వారా రక్తనాళాల ఆరోగ్యాన్ని అంచనా

వేయొచ్చంటున్న నిపుణులు

అధిక రక్తపోటు ప్రభావాలు కంటిలో కనిపించవచ్చని వెల్లడి

రెటీనాలో చిన్న రక్తస్రావాలు హెచ్చరిక సంకేతాలని వివరణ

గుండెపోటు, పక్షవాతం ముప్పుపై పరిశోధనలు

యూకే బయోబ్యాంక్ అధ్యయనాల్లో కీలక వివరాలు

కళ్లు మనకు ప్రపంచాన్ని చూపించడమే కాదు.. మన శరీరంలో దాగి ఉన్న అనారోగ్య సమస్యల గురించి కూడా ముందస్తు సంకేతాలు ఇస్తాయి. ముఖ్యంగా గుండెకు ముప్పు పొంచి ఉందా? రక్తనాళాల్లో ఏవైనా మార్పులు చోటుచేసుకుంటున్నాయా? వంటి విషయాలను కంటి వెనుక భాగంలో ఉండే రెటీనా ద్వారా గుర్తించే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ కంటి పరీక్షల్లోనే గుండె జబ్బుల ముప్పును అంచనా వేసే సరికొత్త విధానాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. మరి కంటిలో కనిపించే మార్పులకు, గుండె ఆరోగ్యానికి సంబంధం ఏంటి? రెటీనా పరీక్ష గుండెపోటు ముప్పును ఎలా పసిగడుతుంది?

కంటితోనే రక్తనాళాల పరిశీలన

మన శరీరంలో రక్తనాళాలను ఎలాంటి శస్త్రచికిత్స లేకుండా నేరుగా పరిశీలించగలిగే అరుదైన భాగం రెటీనా. కంటి వెనుక ఉండే ఈ పొరలో అతి చిన్న రక్తనాళాలు ఉంటాయి. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, ఇన్‌ఫ్లమేషన్ వంటి సమస్యలు రక్తనాళాలపై ప్రభావం చూపినప్పుడు రెటీనాలోనూ మార్పులు కనిపిస్తాయి. అందుకే కంటి పరీక్షలు కేవలం చూపు సమస్యలకే పరిమితం కాకుండా, శరీరంలోని రక్తనాళాల ఆరోగ్యాన్ని అంచనా వేయడంలోనూ ఉపయోగపడతాయని నిపుణులు వివరిస్తున్నారు.

రెటీనాలో కనిపించే హెచ్చరికలు

రెటీనాలోని రక్తనాళాల పరిమాణం, ఆకృతి, వాటి మధ్య ఏర్పడే మార్పులు ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి. రక్తనాళాలు సన్నబడటం: అధిక రక్తపోటు కారణంగా రక్తనాళాల గోడలు మందంగా మారి, లోపలి మార్గం సన్నబడవచ్చు. రక్తనాళాల మధ్య మార్పులు: గట్టిపడిన ధమనులు పక్కనే ఉండే సిరలపై ఒత్తిడి కలిగించవచ్చు. దీన్ని ఏవీ నికింగ్ అంటారు.స్వల్ప రక్తస్రావాలు: రెటీనాలో చిన్న చిన్న రక్తస్రావాలు, మచ్చలు కనిపించడం రక్తనాళాల దెబ్బతినడానికి సంకేతం కావచ్చు.కొలెస్ట్రాల్ మచ్చలు: అరుదుగా రెటీనాలో పసుపు రంగులో కొలెస్ట్రాల్ గడ్డలు కనిపించవచ్చు. ఇవి తీవ్రమైన రక్తనాళాల సమస్యలకు సంకేతం కావొచ్చు.



గుండెపోటు ముప్పును అంచనా వేయొచ్చా

సాధారణంగా గుండె జబ్బుల ముప్పును అంచనా వేయడానికి వయసు, రక్తపోటు, కొలెస్ట్రాల్, ధూమపానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే, కొందరిలో ఈ వివరాలు సాధారణంగానే ఉన్నా గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో రెటీనా పరీక్షలు అదనపు సమాచారాన్ని అందించగలవని పరిశోధనలు సూచిస్తున్నాయి.యూకే బయోబ్యాంక్ ఆధారంగా రూపొందించిన నమూనాలతో సహా పలు అధ్యయనాలు రెటీనాలోని రక్తనాళాల వెడల్పు, వంపులు, విభజన తీరును విశ్లేషించాయి. కృత్రిమ మేధ సాయంతో ఈ మార్పులను పరిశీలించి రక్తనాళాల వయసును అంచనా వేయవచ్చని గుర్తించాయి. ఈ విధానం గుండెపోటు, పక్షవాతం ముప్పును అంచనా వేయడంలో సాధారణ రిస్క్ కాలిక్యులేటర్లతో సమానమైన సమాచారాన్ని అందించగలదని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, ఇప్పటికే ఉన్న పరీక్షలకు రెటీనా సమాచారాన్ని జోడించడం వల్ల ప్రతిసారీ అంచనా కచ్చితత్వం గణనీయంగా పెరగడం లేదని కూడా పరిశోధనలు చెబుతున్నాయి.

కంటి పరీక్షల్లో మార్పులుంటే ఏం చేయాలి

కంటి పరీక్షల్లో రక్తనాళాలు సన్నబడటం, అధిక రక్తపోటు ప్రభావాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బుల కుటుంబ చరిత్ర ఉన్నవారు వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. రెటీనా పరీక్ష ఒక్కటే గుండెపోటును నిర్ధారించలేదు. గుండె ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి వైద్యుల సూచనల మేరకు ఇతర పరీక్షలూ అవసరం. కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడం ద్వారా కొన్ని ఆరోగ్య సమస్యల సంకేతాలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.

నేడు వరల్డ్ హార్ట్ డే మహిళల్లో గుండె జబ్బులు. పురుషులకు భిన్నం

ఛాతీ నొప్పితో పాటు వికారం, అలసట, వీపు నొప్పి కూడా

ఈ లక్షణాలను ఒత్తిడి, జీర్ణ సమస్యలుగా పొరబడే ప్రమాదం

చిన్న రక్తనాళాల సమస్యలు, హార్మోన్ల మార్పులు మహిళల్లో ఎక్కువ

లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని వైద్య నిపుణుల హెచ్చరిక



ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) సందర్భంగా మహిళల్లో గుండె సంబంధిత వ్యాధులు, వాటి లక్షణాలు పురుషులతో పోలిస్తే ఎందుకు భిన్నంగా ఉంటాయో కార్డియాలజిస్టులు వివరిస్తున్నారు. గుండెపోటు అనగానే ఛాతీలో తీవ్రమైన నొప్పి, ఆ నొప్పి ఎడమ చేతికి పాకడం వంటివే ప్రధాన లక్షణాలని చాలామంది భావిస్తారు. అయితే, మహిళల విషయంలో ఈ లక్షణాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కొన్నిసార్లు చాలా భిన్నంగా కనిపించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పురుషులకు, మహిళలకు తేడా ఎందుకు?

పురుషుల్లో గుండెపోటు వచ్చినప్పుడు ఛాతీలో ఒత్తిడి లేదా నొప్పి చేయి, దవడ వరకు వ్యాపించడం సాధారణంగా కనిపిస్తుందని డాక్టర్ అజీత్ బానా తెలిపారు. మహిళల్లోనూ ఈ లక్షణాలు ఉండవచ్చని, కానీ వీటికి అదనంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణమైన అలసట, వికారం, జీర్ణ సమస్యలు, చెమటలు పట్టడం, తల తిరగడం వంటివి కూడా ఉంటాయని ఆయన వివరించారు. ముఖ్యంగా వీపు, భుజాలు, దవడ లేదా పొట్ట పైభాగంలో అసౌకర్యంగా అనిపించడం కూడా గుండె సమస్యకు సంకేతం కావచ్చన్నారు. ఈ లక్షణాలు ఛాతీ నొప్పితో కలిసైనా లేదా అది లేకుండా అయినా రావచ్చని పేర్కొన్నారు.మహిళల్లో కనిపించే లక్షణాలు మనం పుస్తకాల్లో చదివిన దానికి భిన్నంగా ఉంటాయని డాక్టర్ రోహిత్ గోయల్ అన్నారు. "పురుషుల్లో ఎక్కువగా క్లాసిక్ లక్షణాలు కనిపిస్తాయి. కానీ మహిళల్లో నాన్-క్లాసికల్ లక్షణాలు ఎక్కువ. వీటిని తరచుగా ఒత్తిడి, ఆందోళన లేదా అజీర్తి సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది" అని ఆయన హెచ్చరించారు.

చిన్న రక్తనాళాలే కీలకం

మహిళల శరీర నిర్మాణం, హార్మోనల్ మార్పులు, రక్తనాళాల అమరికలో తేడాలు ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. మహిళల్లో 'కొరొనరీ మైక్రోవాస్కులర్ డిస్‌ఫంక్షన్' అంటే చిన్న రక్తనాళాల్లో సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. దీనివల్ల పెద్ద ధమనుల్లో అడ్డంకులు లేకపోయినా నొప్పి, అలసట వంటివి వస్తాయి. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సమస్యలు, మెనోపాజ్ తర్వాత హార్మోన్ల మార్పులు కూడా జీవితకాలంలో గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి.ఈ నేపథ్యంలో, మహిళలు తమ శరీరంలో కనిపించే అసాధారణ లక్షణాలను ఏమాత్రం విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలు, లింగ-నిర్దిష్ట అంచనాలతో ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని చెబుతున్నారు.

పండ్లు ఎక్కువగా తింటే బరువు పెరుగుతారా? నిపుణులు ఏం చెబుతున్నారంటే

ఎక్కువగా తింటే మొత్తం క్యాలరీలు పెరగొచ్చని వెల్లడి

మామిడి, అరటి, ద్రాక్ష, సపోటాలో క్యాలరీలు ఎక్కువ

ప్రాసెస్డ్ స్నాక్స్‌కు పండ్లు మంచి ప్రత్యామ్నాయం

రోజుకు 2-3 సార్లు తీసుకోవచ్చని సూచన

పండ్లతో పాటు ఇతర ఆహారాలనూ తీసుకోవాలని సలహా

బరువు తగ్గాలని డైట్ మొదలుపెట్టగానే చాలామంది పండ్లను ఎక్కువగా తినడం మొదలుపెడతారు. పండ్లు ఆరోగ్యకరమైనవి కాబట్టి ఎంత తిన్నా బరువు పెరగరని భావిస్తుంటారు. అయితే పండ్లలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ ఉన్నప్పటికీ.. మోతాదుకు మించి తింటే మాత్రం క్యాలరీలు పెరిగి బరువు తగ్గే లక్ష్యానికి ఆటంకం కలగొచ్చని నిపుణులు చెబుతున్నారు.

పండ్లలోనూ చక్కెర

పండ్లలో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, డైటరీ ఫైబర్ ఉంటాయి. అయితే వాటిలో సహజ చక్కెర కూడా ఉంటుంది. ముఖ్యంగా మామిడి, అరటిపండు, ద్రాక్ష, సపోటా వంటి క్యాలరీలు ఎక్కువగా ఉండే పండ్లను పెద్ద మొత్తంలో తింటే రోజువారీ క్యాలరీలు పెరిగే అవకాశం ఉంటుంది.

స్నాక్స్‌కు బదులు పండ్లు

చిప్స్, ప్రాసెస్డ్ స్నాక్స్, ఎక్కువ క్యాలరీలు ఉండే డెజర్ట్స్‌కు బదులుగా పండ్లను తీసుకోవడం బరువు తగ్గే ప్రయత్నంలో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు చిప్స్ ప్యాకెట్‌కు బదులుగా ఆపిల్ లేదా అరటిపండు తింటే మొత్తం క్యాలరీలు తీసుకోవడం తగ్గొచ్చు. అయితే రోజంతా తరచూ పండ్లు తింటూ ఉండటం, 'హెల్తీ ఫుడ్' కాబట్టి పెద్ద మొత్తంలో తీసుకోవడం మాత్రం బరువు తగ్గడాన్ని ప్రభావితం చేయొచ్చు.



రోజుకు ఎన్ని సార్లు?

చాలామంది పెద్దలకు రోజుకు 2-3 సార్లు పండ్లు తీసుకోవడం సాధారణంగా సరైన లక్ష్యమని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తి క్యాలరీ అవసరాలు, శారీరక శ్రమ, మొత్తం డైట్‌ను బట్టి ఈ పరిమాణం మారొచ్చు. పండ్ల రసానికి బదులుగా పూర్తిగా పండ్లనే తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.అలాగే ఫైబర్, నీరు ఎక్కువగా ఉండే పండ్లను ఎంచుకుని.. వాటిని ప్రొటీన్ లేదా ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండొచ్చు. పండ్లనే పూర్తిగా ఆహారంగా చేసుకుని మిగతా వాటిని పక్కనపెడితే పోషకాల్లో అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మన గుండె గురించి ఈ విషయాలు తెలుసా ఒక్కసారి చదవాల్సిందే



గుండె అంటే వెంటనే గుర్తుకొచ్చేది ఛాతీ ఎడమవైపు ఉన్న అవయవమే. చిన్నప్పటి నుంచి మనం కూడా అలాగే అనుకుంటూ వచ్చాం. కానీ గుండె పూర్తిగా ఎడమవైపు ఉండదు. ఛాతీ మధ్య భాగంలో, రెండు ఊపిరితిత్తుల మధ్య ఉంటుంది. కొంత భాగం కుడివైపున కూడా ఉంటుంది. 'ప్రపంచ హృదయ దినోత్సవం' సందర్భంగా గుండె గురించి తెలుసుకోవాల్సిన ఆసక్తికర విషయాలు ఇవి.గుండె రెండు ఊపిరితిత్తుల మధ్య ఉండే మీడియాస్టినమ్ అనే ప్రాంతంలో ఉంటుంది. ఇది ఛాతీ ఎముక వెనుక, డయాఫ్రామ్ పైన ఉంటుంది. గుండె మొత్తం ఎడమవైపే ఉందనడం సరైనది కాదు.గుండె నిటారుగా ఉండదు. దాని చివరి భాగాన్ని అపెక్స్ అంటారు. ఇది కిందికి, ఎడమవైపుకు వంగి ఉంటుంది. అందుకే ఛాతీ ఎడమవైపు గుండె చప్పుడు ఎక్కువగా వినిపిస్తుంది.

పిడికిలంత పరిమాణం

సాధారణంగా పెద్దవారి గుండె వారి పిడికిలి పరిమాణంలో ఉంటుంది. శరీర పరిమాణం, వయసును బట్టి గుండె పరిమాణంలో కొంత తేడా ఉండొచ్చు.

గుండెలో నాలుగు గదులు

గుండెలో కుడి కర్ణిక, కుడి జఠరిక, ఎడమ కర్ణిక, ఎడమ జఠరిక అనే నాలుగు గదులు ఉంటాయి. కుడివైపు భాగం శరీరం నుంచి వచ్చిన రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపుతుంది. ఎడమవైపు భాగం ఆక్సిజన్ కలిగిన రక్తాన్ని శరీరమంతా పంపుతుంది.

రెండు వైపులా వేర్వేరు పనులు

గుండె ఒకే అవయవంగా పనిచేసినా దాని కుడి, ఎడమ భాగాలకు వేర్వేరు బాధ్యతలు ఉంటాయి. మధ్యలో ఉండే సెప్టమ్ గోడ ఈ రెండు భాగాలను వేరు చేస్తుంది. దీంతో ఆక్సిజన్ ఉన్న రక్తం, ఆక్సిజన్ తక్కువగా ఉన్న రక్తం సాధారణంగా కలవవు.మన ప్రమేయం లేకుండానే కొట్టుకుంటుంది గుండెను మనం కావాలనుకున్నప్పుడు ఆపలేం. దానికంటూ ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంటుంది. సాధారణంగా సైనోఏట్రియల్ నోడ్ (సా నోడ్) నుంచి విద్యుత్ సంకేతాలు మొదలవుతాయి. ఇవే గుండె కండరాల సంకోచాలను సమన్వయం చేస్తాయి.గుండె చప్పుడు కనిపించే చోటు మారొచ్చు గుండె చప్పుడు సాధారణంగా ఎడమ ఛాతీలోని ఐదో పక్కటెముక మధ్య ప్రాంతంలో స్పష్టంగా అనిపిస్తుంది. అయితే ప్రతి ఒక్కరిలో ఆ ప్రదేశం ఒకేలా ఉండకపోవచ్చు. శరీర నిర్మాణాన్ని బట్టి కొంత తేడా ఉంటుంది.

కివీ పండును ఇలా తింటేనే పూర్తి పోషకాలు లభిస్తాయట

కివీని తొక్కతో తింటేనే ఫైబర్ ఎక్కువగా లభిస్తుందంటున్న

నిపుణులు

పచ్చి కివీ తొక్కలో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు

తొక్కపై వెంట్రుకల్లాంటివి ఉంటే టవల్‌తో రుద్దితే మేలు

గోల్డెన్ కివీ తొక్క తినడానికి మరింత సులభం

రోజుకు రెండు కివీలు జీర్ణక్రియకు ఉపయోగపడొచ్చని

సూచన

పచ్చగా.. జ్యూసీగా ఉండే కివీ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలామందికి తెలుసు. అయితే కివీని ఎలా తింటున్నారు? తొక్క తీసేసి లోపలి గుజ్జు మాత్రమే తింటున్నారా? అలా చేస్తే కివీలో ఉండే కొన్ని ముఖ్యమైన పోషకాలను కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కివీని ఎంచుకోవడం దగ్గరి నుంచి తినే విధానం వరకు కొన్ని చిన్న మార్పులు చేస్తే మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చని సూచిస్తున్నారు.

పచ్చి కివీని తొక్కతోనే తినొచ్చా

పచ్చి కివీపై చిన్న చిన్న వెంట్రుకల్లాంటి పొర ఉంటుంది. అందుకే చాలామంది తొక్క తీసేసి తింటారు. కానీ తొక్కతో కలిపి తింటే ఫైబర్ ఎక్కువగా లభిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ కూడా అధికంగా అందుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు ఇది ఉపయోగపడొచ్చు. మలబద్ధకం సమస్య ఉన్నవారికి మల విసర్జన సక్రమంగా ఉండటంలోనూ సహాయపడే అవకాశం ఉంది.

పొర నచ్చకపోతే ఇలా చేయండి

కివీ తొక్కపై ఉండే వెంట్రుకలు తినడం ఇబ్బందిగా అనిపిస్తే ముందుగా పండును నీటితో బాగా కడగాలి. తర్వాత శుభ్రమైన కిచెన్ టవల్‌తో మెల్లగా రుద్దాలి. దీంతో బయట ఉండే అదనపు వెంట్రుకలు కొంతవరకు తొలగిపోతాయి. ఆ తర్వాత పలుచని ముక్కలుగా కోసుకుని తొక్కతోనే తినొచ్చు.



గోల్డెన్ కివీ అయితే మరింత సులభం

గోల్డెన్ కివీ తొక్క పచ్చి కివీతో పోలిస్తే పలుచగా, మెత్తగా ఉంటుంది. దీనిపై వెంట్రుకలు కూడా దాదాపు ఉండవు. అందుకే తొక్కతోనే తినడం సులభం. తొక్కతో తింటే కేవలం గుజ్జు తినడంతో పోలిస్తే ఫైబర్, విటమిన్-ఈ, ఫోలేట్ ఎక్కువగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

రోజుకు ఎన్ని కివీలు తినాలి

రోజుకు రెండు కివీలు తినడం జీర్ణవ్యవస్థకు ఉపయోగపడొచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు వారాల పాటు రోజుకు రెండు కివీలు తీసుకున్నవారిపై జరిగిన ఓ అధ్యయనంలో మల విసర్జన మరింత సక్రమంగా జరిగినట్లు గుర్తించారు. మల విసర్జన సులభంగా ఉండటంతో పాటు జీర్ణక్రియకు సంబంధించిన అసౌకర్యం కూడా తగ్గినట్లు అధ్యయనంలో పాల్గొన్నవారు తెలిపారు.

కివీకి ఫైబర్‌తో పాటు మరో ప్రత్యేకత

కివీలో కరిగే ఫైబర్‌తో పాటు ప్రీబయోటిక్ ఫైబర్ కూడా ఉంటుంది. ఇది పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆ హారంగా ప నిచేస్తుంది. దీంతో పేగుల ఆరోగ్యానికి మద్దతు లభించొచ్చు. సాధారణ ఫైబర్ సప్లిమెంట్లు ప్ర ధానంగా మలానికి పరిమాణాన్ని పెంచేలా పనిచేస్తే.. కివీలో ఉండే వివిధ రకాల ఫైబర్ పేగుల పనితీరుకు మరింత విస్తృతంగా తోడ్పడే అవకాశం ఉంది.అయితే ప్రతి ఒక్కరి జీర్ణవ్యవస్థ ఒకేలా స్పందించదు. కివీ తిన్న తర్వాత అసౌకర్యం, అలర్జీ వంటి సమస్యలు కనిపిస్తే తినడం ఆపి వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
ఆదివారం 22 - 11 - 2026

గుడ్ న్యూస్ చెప్పిన జియో.. 2030 నాటికి 6జీ నెట్ వర్క్..!



టెలికాం టెక్నాలజీలో తదుపరి దశకు జియో ప్లాట్‌ఫామ్స్ సన్నద్ధమవుతోంది. 2030 కల్లా 6జీ వాణిజ్యపరంగా ప్రారంభించేందుకు ఆ కంపెనీ సిద్ధమవుతుంది. సొంతంగా కొత్త మార్కెట్లలోకి ప్రవేశించకుండా, భాగస్వామ్యాల ద్వారా తన టెక్నాలజీని అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకువెళ్లాలని కూడా ఈ సంస్థ ఆలోచిస్తోంది. జియో ఐపీఓ మీడియా మీట్‌లో జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాష్ అంబానీ దీనిపై స్పందించారు. 6జీ ప్రమాణాల అభివృద్ధికి తమ సంస్థ దోహదపడుతోందని, తమ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ భారతదేశంలోనూ, విదేశాలలోనూ అవకాశాలను కల్పిస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. 6జీ టెక్నాలజీ ఇంకా ప్రామాణీకరణకు ముందు దశలోనే ఉందని, 2029 నాటికి ప్రమాణాలు ఏర్పడే అవకాశం ఉందని అంబానీ అన్నారు. 2030వ దశకం ప్రారంభంలో వాణిజ్యపరమైన విస్తరణలు మొదలవుతాయని అంచనా వేస్తున్నారు. జియో 6జీని ప్రధానంగా ఒక సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్‌గా చూస్తోందని, తన ఎండ్-టు-ఎండ్ టెక్నాలజీ స్టాక్‌లో పెట్టుబడులు కొనసాగిస్తుందని ఆయన వివరించారు. "మాకు, 6జీ ఒక సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ కాబోతోంది. మేము మా సమగ్రమైన ఎండ్-టు-ఎండ్ టెక్నాలజీ స్టాక్‌లో పెట్టుబడులు కొనసాగిస్తాము" అని అంబానీ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి, ప్రతి భారతీయుడికి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడమే జియో విస్తృత లక్ష్యమని ఆయన వివరించారు. రష్యాతో కాళ్లబేరానికి ట్రంప్.. డీజిల్ కొనుగోలుకు అమెరికా సిద్ధమని ప్రకటన.. ఆంక్షలు ఎత్తివేత.. జియో ప్లాట్‌ఫామ్స్ కొత్త మార్కెట్లలోకి నేరుగా ప్రవేశించకుండా స్థానిక సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం ద్వారా తన అంతర్జాతీయ వ్యాపారాన్ని విస్తరించుకోవాలని చూస్తోంది. తాము ప్రారంభించినది ఒక ప్రత్యేకమైన ప్లాట్‌ఫామ్, కేవలం హార్డ్‌వేర్ టెక్నాలజీ లేదా సాఫ్ట్‌వేర్ లైసెన్స్ అమ్మడం కన్నా, స్థానిక సంస్థలకు మేనేజ్డ్ సర్వీస్ భాగస్వామిగా మారడమే మా వ్యాపార నమూనా అని వివరించారు. కంపెనీ ఇప్పటికే తన ఎండ్-టు-ఎండ్ టెక్నాలజీ స్టాక్‌ను సొంత నెట్‌వర్క్‌పై నిర్వహిస్తోందని, తమ తమ మార్కెట్లలో ఈ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోగల తగిన భాగస్వాములను గుర్తించాలని కోరుకుంటున్నట్లు అంబానీ తెలిపారు.జి తాము కొత్త మార్కెట్లలోకి వెళ్లి ప్రవేశించాల్సిన అవసరం ఉందని నమ్మడం లేదన్నారు. తమ టెక్నాలజీ, ఎండ్-టు-ఎండ్ స్టాక్ ఆ భాగస్వాములకు కొత్త మార్కెట్ అవకాశాలను కల్పిస్తుందని తాము విశ్వసిస్తున్నాని పేర్కొన్నారు. జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఉన్న నాలుగు కీలక అవకాశాల రంగాలను అంబానీ వివరించారు. మొబైల్ సేవలు, హోమ్ కనెక్టివిటీ, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్, దాని ప్రధాన సాంకేతికతల ద్వారా ఆదాయాన్ని సంపాదించడం. కంపెనీ సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం, టెక్నాలజీ విలువ గొలుసు అంతటా పాలుపంచుకునే సామర్థ్యాన్ని ఇస్తుందని, తద్వారా దాని ప్రస్తుత టెలికాం వ్యాపారానికి మించి అవకాశాలను సృష్టిస్తుందని ఆయన అన్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

డిసెంబరు నాటికి స్మార్ట్‌ఫోన్ల ధరలు 30 శాతం పైకి!

మెమొరీ చిప్‌ల కొరత, ధరల పెరుగుదలే కారణం

ఏఐ డేటా సెంటర్లతో డీరామ్, న్యాండ్‌లకు డిమాండ్

ఉత్పత్తి వ్యయంలో 43 శాతానికి చేరిన మెమొరీ

శాంసంగ్, షావోమిల నుంచి ఇప్పటికే ధరల బాదుడు

రూ.లక్ష దాటనున్న అత్యధిక ఫ్లాగ్‌షిప్ ఫోన్లు



స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో ప్రీమియం ఫ్లాగ్‌షిప్ మోడల్స్ కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు భారీ షాక్ తగలనుంది. ఏడాది ముగిసే నాటికి ప్రీమియం ఫ్లాగ్‌షిప్ ఫోన్ల ధరలు 30 శాతానికి పైగా పెరిగి ఒక్కో ఫోన్ ధర రూ.లక్ష దాటే అవకాశం ఉందని మార్కెట్ పరిశోధన సంస్థ 'కౌంటర్‌పాయింట్ రీసెర్చ్' శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మెమొరీ చిప్‌ల ధరలు అనూహ్యంగా పెరగడమే ఈ భారీ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ల నుంచి డీరామ్, న్యాండ్ మెమొరీ చిప్‌లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా ఫోన్ల తయారీ వ్యయంలో మెమొరీ వాటా 2025 మొదటి త్రైమాసికంలో 13 శాతంగా ఉండగా, 2026 డిసెంబరు నాటికి ఏకంగా 43 శాతానికి చేరుతుందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ పేర్కొన్నారు. గతంలో భారతదేశంలో రూ.లక్ష ధర పలికే ఫోన్లు చాలా అరుదుగా ఉండేవని, నేడు ఫ్లాగ్‌షిప్ కేటగిరీలో ఈ ధర సర్వసాధారణంగా మారుతోందని నివేదిక స్పష్టం చేసింది.నివేదిక ప్రకారం.. ప్రముఖ బ్రాండ్లలో ఒప్పో ఫ్లాగ్‌షిప్ ఫోన్ల ధరలు గతేడాదితో పోలిస్తే అత్యధికంగా 82 నుంచి 87 శాతం వరకు పెరిగాయి. అల్ట్రా ప్రీమియం విభాగంలో అగ్రస్థానంలో ఉన్న ఐఫోన్ ధరలు 20 నుంచి 22 శాతం వరకు పెరిగాయి. యాపిల్, శాంసంగ్ వంటి దిగ్గజాల ఫ్లాగ్‌షిప్ ఫోన్ల రూ.2 లక్షల మార్కు వైపు పరుగులు తీస్తుండటంతో ఐకూ, గూగుల్ వంటి బ్రాండ్లు పోటీ ధరలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే శాంసంగ్ సంస్థ దీపావళి తర్వాత తన ఫోన్ల ధరలను రూ.2,000 నుంచి రూ.4,000 వరకు పెంచగా, అంతకుముందు గెలాక్సీ ఎస్26 ధరను 17 శాతం పెంచింది. చైనీస్ బ్రాండ్ షావోమి సైతం దీపావళి తర్వాత ఇదే స్థాయిలో ధరలను సవరించింది.

వాహనదారులకు అలర్ట్.. పెట్రోల్‌పై పన్ను పెంపు, డీజిల్‌పై తగ్గింపు

నేటి నుంచి అమల్లోకి..



అంతర్జాతీయ ఇంధన విపణిలో ముడి చమురు ధరల తీవ్ర ఊగిసలాట, ఉద్రిక్తతల నడుమ భారత ప్రభుత్వం చమురు శుద్ధి కర్మాగారాల (రిఫైనరీలు) అదనపు లాభాలపై విధించే విండ్‌ఫాల్ పన్ను రేట్లను సవరించింది. పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధిస్తున్న ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని భారీగా మారుస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ వెల్లడించిన ఈ కొత్త పన్ను రేట్లు అక్టోబర్ 16, 2026 నుండి తక్షణమే అమల్లోకి వచ్చాయి. ప్రభుత్వం వెలువరించిన నూతన నిబంధనల ప్రకారం.. విదేశాలకు డీజిల్ ఎగుమతి చేసే కంపెనీలపై లీటరుకు రూ. 16గా ఉన్న అదనపు ఎక్సైజ్ సుంకాన్ని సగానికి పైగా తగ్గిస్తూ లీటరుకు రూ. 8.5గా నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా భారతీయ చమురు కంపెనీలకు విదేశీ విపణిలో డీజిల్ విక్రయాలపై గణనీయమైన ఊరట లభించనుంది. మరోవైపు పెట్రోల్ ఎగుమతులపై గతంలో లీటరుకు రూ. 0.5గా ఉన్న సుంకాన్ని నాలుగు రెట్లు పెంచి లీటరుకు రూ. 2.5 చేశారు. అయితే విమాన ఇంధనం ఎగుమతులపై విధించే పన్నులో మాత్రం కేంద్రం ఎలాంటి మార్పు చేయలేదు. సాధారణంగా అంతర్జాతీయ మార్కెట్లో గత 15 రోజుల సగటు ముడి చమురు ధరలను, రిఫైనరీల శుద్ధి మార్జిన్లను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ప్రతి పక్షం రోజులకు ఒకసారి ఈ విండ్‌ఫాల్ లాభాల పన్నును సమీక్షిస్తుంది. యుద్ధ భయాలు, అంతర్జాతీయ సరఫరా కొరత లేదా ధరలలో ఆకస్మిక పెరుగుదల వల్ల చమురు ఉత్పత్తిదారులు, రిఫైనరీలు ఆర్జించే అసాధారణ (విండ్‌ఫాల్) లాభాలపై ఈ అదనపు పన్ను విధిస్తారు. వాహనదారులకు బిగ్ షాక్.. పెట్రోల్ బంకుల్లో యూపీఐ బంద్.. ఓన్లీ క్యాష్ అంటున్న యజమానులు.. ఈ పన్ను సవరణల వల్ల సాధారణ ప్రయాణికులకు లేదా దేశీయ వాహనదారులకు ఎలాంటి వ్యత్యాసం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశీయంగా పంపుల వద్ద విక్రయించే పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల పై ఉన్న పన్ను నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుంది. ఈ నిర్ణయం కేవలం విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేసే రిఫైనరీల శుద్ధి మార్జిన్లు, రాబడులను మాత్రమే ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడం, హార్మూజ్ జలసంధి సమీపంలో నౌకల రాకపోకలపై బెదిరింపులు రావడంతో గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు $106 సమీపంలో, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ $98 వద్ద వర్తకమవుతున్నాయి. చమురు అవసరాల కోసం దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్‌కు అధిక ముడి చమురు ధరలు దేశీయ ద్రవ్యోల్బణం, దిగుమతి బిల్లు, రూపాయి మారకపు విలువపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ సవరణల ద్వారా ఎగుమతి సుంకాల ఆదాయాన్ని సమతుల్యం చేస్తూనే, దేశీయ అవసరాలకు ఇంధన కొరత ఏర్పడకుండా చూడటమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

సామాన్యుడి బైక్‌పై ధరల భారం

హీరో స్ప్లెండర్ ప్లస్ రేట్లు రూ.3,086 పెంపు

స్ప్లెండర్ ప్లస్ ధరలు రూ. 3,086 వరకు పెంపు

స్పెషల్ ఎడిషన్స్‌లో 3 సరికొత్త కలర్ ఆప్షన్లు

గరిష్ఠంగా స్పెషల్ ఎడిషన్‌పైనే రూ.3,086 పెరుగుదల

బేస్ డ్రమ్, ఐ3ఎస్ వేరియంట్లపై రూ. 1,135 పెంపు

స్ప్లెండర్ ప్లెక్స్ ధర రూ. 1,332 పైకి



భారతదేశంలో 100సీసీ కమ్యూటర్ బైక్‌లలో తిరుగులేని ఆదరణ కలిగిన 'హీరో స్ప్లెండర్ ప్లస్' ధరలను దేశీయ ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ పెంచింది. స్ప్లెండర్ మార్కెట్లోకి వచ్చి 32 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రస్తుతం లభిస్తున్న నాలుగు వేరియంట్లపై గరిష్ఠంగా రూ. 3,086 వరకు ధరలు పెరిగాయి.కంపెనీ గతంలో అందించిన 'బ్లాక్ అండ్ యాక్సెంట్' మోడల్‌ను ఇప్పుడు 'స్పెషల్ ఎడిషన్స్'గా రీబ్రాండ్ చేసింది. ఈ స్పెషల్ ఎడిషన్‌లో మ్యాట్ గ్రే, మ్యాట్ వెర్నియర్ గ్రే, క్యాండీ బ్లేజింగ్ రెడ్ అనే మూడు సరికొత్త రంగులను పరిచయం చేశారు. కాగా ఈ స్పెషల్ ఎడిషన్ వేరియంట్‌పైనే అత్యధికంగా రూ. 3,086 పెరగడంతో దీని ధర రూ. 81,666కు చేరింది. బేస్ డ్రమ్ వేరియంట్, ఐ3ఎస్, 125 మిలియన్ ఎడిషన్లపై రూ. 1,135 చొప్పున ధరలు పెరిగాయి.మరోవైపు సరికొత్త సాంకేతికతతో వచ్చిన 'ఎక్స్‌టెక్ 2.0' వేరియంట్‌లో ఎల్ఈడీ హెడ్‌లైట్, ఇండికేటర్లకు హజార్డ్ లైట్ల ఫీచర్లను జోడించినప్పటికీ, ఇందులో ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయం ఇవ్వకపోవడం గమనార్హం. ప్రస్తుతం ముందు వైపు డిస్క్ బ్రేక్ సదుపాయం కేవలం సాధారణ ఎక్స్‌టెక్ వేరియంట్‌లో మాత్రమే అందుబాటులో ఉంది (ధర రూ. 85,461). ప్లెక్స్-ఇంధన ఇంజిన్‌తో వచ్చిన స్ప్లెండర్ ప్లస్ ప్లెక్స్ వేరియంట్ ధర కూడా రూ. 1,332 పెరిగి రూ. 84,042కు చేరింది.

సుప్రీం కోర్టు తీర్పుతో భారీగా పడిపోయిన యెస్ బ్యాంక్ షేర్లు

ఇక కోలుకోవడం కష్టమేనా



యెస్ బ్యాంకు సుప్రీం కోర్టు షాకిచ్చింది. యెస్ బ్యాంక్ చేపట్టిన రూ. 8,415 కోట్ల విలువైన అడిషనల్ టైర్-1 -1) బాండ్ల రద్దును గురువారం కొట్టివేసింది. ఈ పరిణామంతో ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన యెస్ బ్యాంక్ షేర్లు 15% పడిపోయాయి. అక్టోబర్ 15న మధ్యాహ్నం 2:45 గంటల సమయానికి యెస్ బ్యాంక్ షేర్లు 15% క్షీణించి ఒక్కొక్కటి రూ. 18.02 వద్ద ట్రేడవుతున్నాయి. యెస్ బ్యాంక్‌లో దాదాపు 25% వాటాను కలిగి ఉన్న జపాన్‌కు చెందిన రెండవ అతిపెద్ద ఆర్థిక సంస్థ



మెగాస్టార్ విశ్వంభర.. అదొక్కటే బ్యాలెన్స్..!

మెగాస్టార్ ఫ్యాన్స్ ఎన్నో రోజులుగా ఎదురు చూస్తోన్న చిత్రాల్లో విశ్వంభర ఒకటి. ఇప్పటికే రిలీజ్ కావాల్సినా ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పటికీ ఈ సినిమా రిలీజ్ తేదీని ఇంకా ప్రకటించలేదు మేకర్స్. ఈ చిత్రానికి బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు మెగాస్టార్ అభిమానులు కాకా మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విశ్వంభరకు సంబంధించి క్రేజీ టాక్ వినిపిస్తోంది. ఎట్టకేలకు ఈ సినిమా మళ్లీ ట్రాక్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా ట్రైలర్ కట్ సహా డబ్బింగ్ పక్క తరవేగంగా జరుగుతోందని లేటేస్ట్ టాక్. ఇప్పటికే ట్రైలర్ కూడా సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు డబ్బింగ్ పనులు సైతం త్వరగా పూర్తి చేయాలని మేకర్స్ టార్గెట్‌గా పెట్టుకున్నారట. ఇదంతా చూస్తుంటే విశ్వంభర మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అర్థమవుతోంది. అయితే ఈ మూవీ రిలీజ్ తేదీని రివీల్ చేయాల్సి ఉంది. దీనిపై కూడా త్వరలోనే క్లారిటీ వచ్చేలా కనిపిస్తోంది. ఇదంతా చూస్తుంటే విశ్వంభరకు లైన్ క్లియర్ అయినట్లేనని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక రిలీజ్ తేదీనిఎప్పుడు రివీల్ చేస్తారో తెలియాల్సి ఉంది. కాగా.. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ హీరోయిన్స్‌గా నటించారు. ఈ మూవీకి కీరవాణి, గౌర హరి సంగీతమదించగా.. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మించారు.

అది నాన్న-కూతురు బంధం..

మిస్కిన్ వివాదంపై స్పందించిన కీర్తి సురేష్!



చెన్నైలో జరిగిన 'సత్యవాన్ సావిత్రి' చిత్ర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో దర్శకుడు మిస్కిన్ తనను ప్రశంసిస్తూ తొడ భాగం వైపు స్వల్పంగా తాకిన వీడియో వైరల్ అయిన నేపథ్యంలో నటి కీర్తి సురేష్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ వీడియోపై నెట్టింట పలువురు భిన్నంగా వ్యాఖ్యానించగా, ఒక యూజర్ ఆమె అసౌకర్యంగా ఉన్నట్లు కనిపించారని పేర్కొంటూ, సినిమాల్లో సన్నివేశాల కోసం తాకినప్పుడు బయట అలాంటి వాటికి ఎందుకు అంగీకరించరని ప్రశ్నించారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా కీర్తి సురేష్ స్పందిస్తూ, తన ముఖంలో అసౌకర్యం ఎక్కడ కనిపించిందని ప్రశ్నించారు. తమ మధ్య తండ్రీకూతుళ్ల తరహా బంధం ఉందని తాము చెప్పిన మాటలు వినిపించలేదా అని నిలదీశారు. ఒకవేళ తాను అసౌకర్యంగా ఉన్నా, సినిమాల్లో తాకుతారు కాబట్టి బయట కూడా అలాగే ఉండాలని చెప్పడం సరికాదని హితవు పలికారు. కొన్ని విషయాలను సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆ నెటిజన్‌కి చురకలంటించారు. కీర్తి సురేష్ స్పందన తర్వాత ఆ నెటిజన్ తన పోస్ట్‌ను తొలగించి, తనకు ఎలాంటి చెడు ఉద్దేశం లేదని క్షమాపణ కోరారు. మరోవైపు, ఈ వ్యవహారంలో ఎలాంటి అసౌకర్యం గానీ, దురుద్దేశం గానీ లేదని కీర్తి స్పష్టం చేశారని మరికొందరు నెటిజన్లు కూడా పేర్కొన్నారు.

బాక్సాఫీస్ వద్ద 'ఈఎన్ఈ రిపీట్' దూకుడు..

తొలి రోజే రూ.15 కోట్ల వసూళ్లు!

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'ఈఎన్ఈ రిపీట్' బాక్సాఫీస్ దగ్గర తొలి రోజే మంచి వసూళ్లను రాబట్టింది. 2018లో వచ్చి కల్ట్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ నగరానికి ఏమైంది సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.15.27 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా, తొలి రోజే పార్ట్-1 లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసిందని చిత్రబృందం తెలిపింది. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వివేక్ సాగర్ సంగీతంతో వచ్చిన ఈ సినిమాను ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా సంస్థలు నిర్మించాయి. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీనాథ్ మాగంటి, వెంకటేష్ కాకుమాను, అనీషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ ఈ గ్యాంగ్‌తో కలిసి మరోసారి సందడి చేశారు. మరోవైపు ఈ సినిమా పార్ట్1కి ఉన్న క్రేజ్ వలన ఓవర్సీస్‌లో కూడా దూసుకుపోతుంది.



తల్లిదండ్రులైన సమంత - రాజ్ నిడిమోరు..

కొడుకుకు 'దేవ్ నిడిమోరు' అని నామకరణం!



టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు తల్లిదండ్రులయ్యారు. ఈ జంటకు పండంటి మగబిడ్డ జన్మించగా, తమ చిన్నారికి 'దేవ్ నిడిమోరు' అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఇంటికి కొత్త సభ్యుడి రాకతో ఇరు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకర విషయాన్ని పంచుకుంటూ సమంత సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ ఫోటోను పోస్ట్ చేసింది. తమ ముద్దుల కొడుకు చిట్టి వేళ్లను పట్టుకుని ఉన్న ఆ చిత్రం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక తల్లిదండ్రులుగా కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన సమంత, రాజ్ నిడిమోరులకు సినీ పరిశ్రమలోని సహచరులు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారి దేవ్ నిడిమోరుకు ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలగాలంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.